

4 లో

పటిష్ట బందోబస్తు ఏర్పాటు: జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు

RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7569677170



ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :191 సంపాదకులు: కలిచేటి వెంకయ్య మంగళవారం 9 జూన్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad


# బీహార్‌లో మృత్యుఘోష




## నెల్లూరు జిల్లా యాత్రికుల బస్సుకు ప్రమాదం.. ముగ్గురు మృతి


నెల్లూరు : నెల్లూరు జిల్లా నుంచి కాశీ యాత్రకు వెళ్లిన భక్తుల బస్సు ఆదివారం అర్ధరాత్రి బీహార్ రాష్ట్రం ఔరంగాబాద్ వద్ద ఘోర ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 1వ తేదీన నెల్లూరు జిల్లాలోని సంగం నుంచి 43 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఈ బస్సు, గయ నుంచి వారణాసి వెళ్లే క్రమంలో జాతీయ రహదారి (చీ౨-2) పై ఎదురుగా వస్తున్న ఒక వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి బస్సు ఎడమవైపున కూర్చున్న నెల్లూరు జిల్లావాసులు ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు, అధికారులు క్షతగాత్రులను తక్షణ చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. కాశీ యాత్రలో జరిగిన ఈ ఘోర ప్రమాద వార్త తెలియడంతో నెల్లూరు జిల్లాలోని బాధితుల స్వగ్రామాల్లో తీవ్ర విషాదం, ఆందోళన నెలకొన్నాయి. పరాయి రాష్ట్రంలో ప్రమాదంలో చిక్కుకున్న తమను ఆదుకుని, స్వస్థలాలకు సురక్షితంగా చేర్చేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని బాధితులు, వారి కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

## బీహార్‌లో నెల్లూరు యాత్రికుల బస్సు ప్రమాదంపై చంద్రబాబు విచారం

**అమరావతి, సింధూరదర్శిని:** బీహార్‌లోని ఔరంగాబాద్ సమీపంలో నెల్లూరు జిల్లాకు చెందిన కాశీ యాత్ర టూరిస్ట్ బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ముగ్గురు చనిపోవడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు సానుభూతి తెలిపారు. ప్రమాద ఘటనపై అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. క్షతగాత్రులకు అందుతోన్న వైద్యంపై ఆరా తీశారు. నెల్లూరు జిల్లా నుంచి 46మంది యాత్రికులతో కాశీ వెళ్లిన ఈ బస్సు ఔరంగాబాద్ వద్ద మరో వాహనాన్ని బలంగా ఢీకొట్టిందని అధికారులు సీఎంకు తెలిపారు. ఈ దుర్ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని, 15మందికి గాయాలయ్యాయని వివరించారు. బీహార్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి బాధితులకు సాయం అందేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు.

ప్రమాదం నుంచి బయటపడిన యాత్రికులను స్వస్థలాలకు చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.





## 2027 నాటికి భూ రికార్డులు క్లీన్

- -రికార్డుల పూర్తి ప్రక్షాళనకు 3 ఏళ్ల సమయం
- -కరెన్సీ నోట్ల తరహాలో పాస్ పుస్తకాలకు భద్రతా ఫీచర్లు
- -రాష్ట్రంలో రాజకీయం చేసే అర్హత గొడ్డలి పార్టీకి ఎక్కడిది..?
- -మేం రాజముద్రతో పట్టాలిస్తున్నాం... వాళ్లు దొంగ పట్టాలు సృష్టిస్తున్నారు
- -సిద్ధాంతంలో మీ భూమి- మీ హక్కు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**ఆచంట, సింధూరదర్శిని:** 2027 నాటికి రాష్ట్రంలో భూ రికార్డులను ప్రక్షాళన చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గత పాలకులు పశ్చిమ గోదావరి జిల్లా లాంటి పచ్చని ప్రాంతంలోనూ భూ చిచ్చు పెట్టారని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. గజం భూమిని కూడా సద్వినియోగం చేసుకునే రైతులనూ గత ప్రభుత్వం వదిలి పెట్టలేదని తీవ్రస్థాయిలో ఆరోపించారు. పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతంలో మిగతా 2లో...

## విశాఖ స్టీల్ ప్లాంటులో ఘోర ప్రమాదం..

- -హాట్ మెటల్ పడి ఎనిమిది మంది సజీవ దహనం
- -హాట్ మెటల్ ల్యాడిల్స్ కిందపడి సజీవదహనం
- -స్టీల్ మెల్టింగ్ స్టేషన్-2లో చోటుచేసుకున్న ఘటన
- -పలువురికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు
- -మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆందోళన



**విశాఖపట్నం సింధూరదర్శిని:** విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో సోమవారం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది కార్మికులు సజీవ దహనం కాగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. స్టీల్ మెల్టింగ్ స్టేషన్-2 విభాగంలో ఈ విషాదం ఘటన చోటుచేసుకుంది. స్టీల్ మెల్టింగ్ మిగతా 2లో...

## నేడు రాష్ట్ర గవర్నర్ నెల్లూరుకు రాక

### కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీస్ శాఖ



నెల్లూరు (సింధూరదర్శిని) 8 జూన్ నెల్లూరు జిల్లా ; ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ మంగళవారం నెల్లూరు జిల్లాలో పర్యటించి, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం 10వ, 11వ మరియు 12వ స్నాతకోత్సవ (కాన్వొకేషన్) కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం విస్తృత భద్రతా చర్యలు చేపట్టింది. జిల్లా ఇంచార్జ్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో, జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సి.హెచ్. సౌజన్య పర్యవేక్షణలో గవర్నర్ పర్యటన సజావుగా, భద్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక భద్రతా ప్రణాళిక అమలు చేస్తున్నారు. మిగతా 2లో...

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం - పారదర్శక పరిపాలనే మా లక్ష్యం

సాంకేతిక సంస్కరణలతో దేశానికే ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లైస్ శాఖ
రాష్ట్ర ఆహార , పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్




**అమరావతి, సింధూరదర్శిని:** రాష్ట్రంలో రైతు సంక్షేమాన్ని కేంద్ర బిందువుగా తీసుకుని, పారదర్శకత, సాంకేతికత, వేగవంతమైన సేవల సమన్వయంతో సివిల్ సప్లైస్ శాఖ గత రెండు సంవత్సరాల్లో చారిత్రాత్మక సంస్కరణలను అమలు చేసి దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర ఆహార ౘ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రైతు ఎక్కడా ఇబ్బందులు పడకుండా, ధాన్యం కొనుగోళ్లలో సంపూర్ణ పారదర్శకత, తక్షణ చెల్లింపులు, మధ్యవర్తుల నిర్మూలన, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో, ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అధికారులు, రైతు సహాయక మిగతా 2లో...

## విశాఖ స్టీల్ ప్లాంటులో ఘోర ప్రమాదం..

**(మొదటిపేజీ తరువాయి)**

స్టేషన్-2లో కన్వేయర్ ద్వారా హాట్ మెటల్ (మరుగుతున్న ఉక్కు ద్రవం) ఉన్న ల్యాడిల్స్‌ను తరలిస్తుండగా అవి ఒక్కసారిగా కుప్పకూలాయి. దీంతో అత్యధిక ఉష్ణోగ్రత వద్ద ఉన్న ఉక్కు ద్రవం... కింద పనిచేస్తున్న కార్మికులపై పడింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, సమీపంలో ఉన్న మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, ప్లాంటు అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ప్రస్తుతం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నారు. ఈ ఊహించని దుర్ఘటనతో స్టీల్ ప్లాంటులో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి గల ప్రాథమిక కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు.

## నేడు రాష్ట్ర గవర్నర్ నెల్లూరుకు రాక

**(మొదటిపేజీ తరువాయి)**

ఈ సందర్భంగా బందోబస్తులో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సి.హెచ్. సౌజన్య, మరియు టౌన్ దీక్ష ,పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ నందు సమగ్ర బ్రీఫింగ్ నిర్వహించారు. గవర్నర్ పర్యటన సమయంలో పాటించాల్సిన భద్రతా విధానాలు, విధుల నిర్వహణలో అప్రమత్తత, ట్రాఫిక్ నియంత్రణ, కాన్వాయ్ భద్రత, అత్యవసర పరిస్థితుల్లో స్పందన తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఇదే క్రమంలో నెల్లూరు రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని ప్రధాన వేదిక వి పి ఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు విక్రమ సింహపురి యూనివర్సిటీ యొక్క ప్రధాన స్నాతకోత్సవ కార్యక్రమం జరగనున్నందున అక్కడ రూరల్ ఎస్ డి పి ఓ ఘట్టమనేని శ్రీనివాస రావు బందోబస్త్ ఫోర్స్ కు బ్రీఫ్ంగ్ నిర్వహించడం జరిగింది.బ్రీఫింగ్ అనంతరం గవర్నర్ పర్యటన మార్గంలో జిల్లా అడిషనల్ ఎస్పీ సి.హెచ్. సౌజన్య ఆధ్వర్యంలో కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. హెలిప్యాడ్ నుండి కార్యక్రమ వేదిక వరకు ప్రయాణ మార్గాన్ని పరిశీలించి, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, కీలక కూడళ్లు మరియు సున్నిత ప్రాంతాల వద్ద చేపట్టాల్సిన చర్యలను సమీక్షించారు. ఈ నేపథ్యంలో క్విక్ రియాక్షన్ టీమ్స్, టీమ్స్ డాగ్ స్క్వాడ్లు, ట్రాఫిక్ మరియు ఇంటెలిజెన్స్ సిబ్బందిని మోహరించి హెలిప్యాడ్, కార్యక్రమ వేదిక, గవర్నర్ ప్రయాణ మార్గంలో బహుళస్థాయి భద్రతా వలయం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా టౌన్ పబ్లిక్ మరియు వాహనదారులు పోలీసు శాఖకు సహకరించి, ట్రాఫిక్ ఆంక్షలు మరియు భద్రతా సూచనలను పాటించాలని దర్గామిట్ట సీఐ కళ్యాణ్ రావు, నెల్లూరు రూరల్ సీఐ శ్రీ వేణు మరియు సౌత్ ట్రాఫిక్ సీఐ శ్రీ వెంకట రెడ్డి విజ్ఞప్తి చేసారు.

## ఘనంగా చంద్ర రాజేశ్వరరావు జయంతి



హైదరాబాద్ సింధూరదర్శిని: భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కీర్తిశేషులు చంద్ర రాజేశ్వరరావు 112వ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ లోని కొండాపూర్ సిఆర్ ఫౌండేషన్ లో సోమవారం జరిగిన జయంతి సభలో పలు రంగాల ప్రముఖులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. తొలుతగా ప్రాంగణంలోని చంద్ర రాజేశ్వరరావు విగ్రహానికి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి, ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కే. నారాయణ, నీలం రాజేశ్వర్ రెడ్డి విగ్రహానికి సి ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం 'బొద్దింకల ఆవిర్భావం - యువత, నెటిజెన్స్ ఎటువైపు' అనే అంశం పై కే శ్రీనివాసరెడ్డి స్మారక ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ సభ్యులు పీజే చంద్రశేఖర రావు, హోమ్ డైరెక్టర్ ఈ చెన్నకేశవులు, మెడికల్ డైరెక్టర్ కే. రజిని, ఉమెన్ వెల్ఫేర్ డైరెక్టర్ జే. కల్పన, ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి రాష్ట్ర మాజీ కార్యదర్శి, సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు, అమ్మనబ్రోలు వెంకట సత్యనారాయణ (రిటైర్డ్, ప్రభుత్వ ముద్రణాలయం), అమ్మనబ్రోలు రాంబాబు (రిటైర్డ్, కస్టమ్స్ సెంట్రల్ ఎక్సైజ్) తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలను త్వరగా పరిష్కరించాలి

### ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు ( సింధూర దర్శిని) 8 జూన్ నెల్లూరు జిల్లా ; పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు సోమవారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు సమస్యల పై వచ్చిన ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రీవెన్స్ లో వచ్చిన అర్జీలను త్వరగా పరిశీలించి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# 2027 నాటికి భూ రికార్డులు క్లీన్

**(మొదటిపేజీ తరువాయి)**

మీ భూమి- మీ హక్కు పేరిట రాజ ముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. దుర్మార్గమైన గత పాలకుల నిర్వాకంతో రికార్డులన్నీ గందరగోళంగా తయారయ్యాయని ప్రజలకు చెందిన భూముల విషయంలో సమస్యలు సృష్టించారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన భూ రికార్డులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేశారని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ లాంటి దుర్మార్గపు చట్టాన్ని రద్దు చేసి యాజమాన్య హక్కుల్ని రక్షించామని వివరించారు. క్యూ ఆర్ కోడ్ సహా కరెన్సీ నోట్ల తరహాలోనే అత్యంత పటిష్టమైన భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు చేసిన అవకతవకల కారణంగా భూమి రికార్డుల ప్రక్షాళనకు 3 ఏళ్ల సమయం పడుతుందని సీఎం అన్నారు. దేశంలోనే తొలిసారి బ్లాక్ చైన్ ఆధారిత భూ రికార్డుల వ్యవస్థను అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతీ యూనిట్ కు శాశ్వతమైన బ్లాక్ చైన్ ఐడీలు ఇస్తున్నామని.. దీని ద్వారా రికార్డులను ట్యాంపరింగ్ చేసేందుకు అవకాశం ఉండదని తెలిపారు. ప్రజల ఆస్తి పత్రాలపై ఫోటోలు ముద్రించుకున్నారని.. పొలం సరిహద్దు రాళ్లపై బొమ్మల కోసం రూ.800 కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. ప్రస్తుతం భూముల రీసర్వే ప్రక్రియలో రైతులను కూడా భాగస్వాములను చేస్తున్నామని... ఈకేవైసీ చేశాకే పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించి రైతులకు అందిస్తున్నామని అన్నారు. ఇప్పటికే 6688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి భూమి రికార్డులను అప్డేట్ చేశామని అన్నారు. 26.46 లక్షల మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేశామన్నారు. వచ్చే 9 నెలల్లో మరో 10,357 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 67.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. 2027 నాటికి రాష్ట్రంలో ప్రతీ రైతు వద్దా తప్పుల్లేని పాస్ పుస్తకం ఉంటుందని అన్నారు.

**రెవెన్యూ శాఖలో సమూల మార్పులు**

రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని... రీ-సర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశామని సీఎం వివరించారు. విక్రయం, బహుమతి, విభజన వంటి 9 లక్షల లావాదేవీలకు 100 శాతం ఆటో మ్యుటేషన్ తెచ్చామని తెలిపారు. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేశామని... రూ.10 లక్షల లోపు ఆస్తులకు రూ.100తో బదిలీ చేస్తున్నామని స్పష్టం చేశారు. 1బీ, అడంగల్, డీకేటీ, ఇనాం, సీలింగ్ వంటి పాత రికార్డుల డిజిటైజేషన్ ప్రక్రియ చేపట్టామని అన్నారు. 80 శాతం ఈ-కేవైసీ పూర్తయిన తర్వాతే గ్రామాలను వెబ్ ల్యాండ్ 2.0లోకి తీసుకుంటున్నామని అన్నారు. వాట్సాప్ ద్వారా మ్యుటేషన్‌దరఖాస్తు, ట్రాకింగ్ సౌకర్యం కల్పించామన్నారు. రాష్ట్రంలోని 1.37 లక్షల ఎకాల విలేజ్ సర్వీసు ఇనామ్ భూములను 22 ఏ నుంచి తప్పించామని తెలిపారు. తిరుపతి జిల్లాలో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న శెట్టిపల్లి గ్రామ భూములను పరిష్కరించి వారికి అప్పగించామన్నారు. అక్వా రైతులకు అండగా నిలబడ్డామని సీఎం స్పష్టం చేశారు. గోదావరి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో పాటు, ఆక్వా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరిచారు. ఆక్వా జోన్ పరిధిలోని చెరువులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. అక్వా ఫీడ్ రేట్లు పెరగడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని రాయితీలు ఇవ్వాలని సోయాబీన్ మీల్ దిగుమతులపై సుంకాలు తగ్గించాలని కేంద్రాన్ని కోరామన్నారు.

పశ్చిమ గోదావరి లాంటి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంపై దృష్టి పెట్టామని సీఎం వివరించారు. ఆక్వా పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలు కాలుష్య సమస్యగా మారకుండా న్యూట్రాసిటికల్ ఔషధాల తయారు చేసుకునే అవకాశం ఉందన్నారు.

# బీహార్ రోడ్డు ప్రమాద బాధితులకు నష్టపరిహారం

**మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు, తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు 2 లక్షలు, పాక్షికంగా గాయపడిన వారికి లక్ష చొప్పున ఆర్థిక సహాయం:మంత్రి ఆనం**

నెల్లూరు( సింధూర దర్శిని) 8 జూన్ నెల్లూరు జిల్లా ; బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నెల్లూరు జిల్లా వాసుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నష్టపరిహారం ప్రకటించినట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు రూ.2 లక్షల చొప్పున, పాక్షికంగా



గాయపడిన వారికి రూ.1 లక్ష చొప్పున నష్టపరిహారం అందజేయనున్నట్లు తెలిపారు.
నష్టపరిహారం ప్రకటించి బాధితులకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి కి ఈ సందర్భంగా మంత్రి ఆనం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ప్రమాద బాధితుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందించి అండగా నిలుస్తుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బాధితులకు భరోసా కల్పించారు.బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు.

# కాణిపాకంలో యోగాంధ్ర ఉత్సవాలు: ఆలయ ఈవో పెంచల కిషోర్

కాణిపాకం (సింధూర దర్శిని) 8 జూన్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం ఆస్థాన మండపం నందు యోగాంధ్ర ఉత్సవాల్లో భాగంగా సోమవారం నుండి ఈనెల 21 తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు దేవస్థానం సిబ్బంది, మరియు పరిసర గ్రామస్తులు, భక్తులతో యోగ నిర్వహించడం జరుగుతుంది, మొదటి రోజు ప్రారంభించడం జరిగింది, ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఏఈఓ ఎస్వి కృష్ణారెడ్డి, హరి మాధవరెడ్డి, సూపర్డెంట్ కోదండపాణి, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం - పారదర్శక పరిపాలనే మా లక్ష్యం

**(మొదటిపేజీ తరువాయి)**

కేంద్రాల సిబ్బంది, వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ మరియు అనుబంధ శాఖల సమన్వయంతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు.
రైతు కష్టపడి పండించిన ప్రతి గింజకు గౌరవం దక్కేలా, ధాన్యం విక్రయంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టిందన్నారు. రైతు సంక్షేమాన్ని కేంద్రబిందువుగా తీసుకుని, పారదర్శకత, వేగవంతమైన చెల్లింపులు, సాంకేతిక ఆధారిత సేవలతో దేశంలోనే ఆదర్శవంతమైన ధాన్యం కొనుగోలు విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.
ఈ ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 17.97 లక్షల మంది రైతుల నుండి 1.29 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో సుమారు రూ.30,361 కోట్ల విలువైన ధాన్యం కొనుగోళ్లు నిర్వహించి, రైతులకు సకాలంలో చెల్లింపులు చేయడం జరిగిందన్నారు.
రైతులకు చెల్లింపుల విషయంలో అత్యంత వేగవంతమైన విధానాన్ని అమలు చేస్తూ, 90 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేయగా, మిగిలిన చెల్లింపులు కూడా 48 గంటలు దాటకుండా పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. రైతులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా, చెల్లింపుల్లో జాప్యం లేకుండా, పూర్తి పారదర్శకతతో ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు.
రైతులకు మరింత సులభమైన, పారదర్శకమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ ఆధారిత ధాన్యం నమోదు మరియు విక్రయ విధానాన్ని అమలు చేసినట్లు తెలిపారు. ఈ వినూత్న వ్యవస్థ ద్వారా రైతులు ఎటువంటి మధ్యవర్తుల అవసరం లేకుండా నేరుగా తమ ధాన్యాన్ని నమోదు చేసి విక్రయించే అవకాశం పొందుతున్నారన్నారు.
ఇప్పటికే 40 వేల మందికి పైగా రైతులు ఈ విధానాన్ని వినియోగించుకుని సుమారు 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నేరుగా సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌కు విక్రయించినట్లు ఆయన తెలిపారు. ఈ సంస్కరణ ద్వారా మధ్యవర్తుల జోక్యం గణనీయంగా తగ్గడమే కాకుండా, రైతులకు పారదర్శక వ్యవస్థలో నేరుగా లాభం చేకూరిందని ఆయన పేర్కొన్నారు.
వర్షాకాలంలో ధాన్యం తడవకుండా కాపాడేందుకు దేశంలోనే తొలిసారిగా చిన్న, సన్నకారు రైతులకు రూ.50 కోట్లు విలువైన టార్పాలిన్లు ఉచిత పంపిణీ చేసినట్లు మంత్రి తెలిపారు. తుఫానులకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి రైతు సహాయక కేంద్రాల ద్వారా ఈ సేవలు అందించామని పేర్కొన్నారు.

**"దీపం--2" పథకం - కోట్లాది కుటుంబాలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల లబ్ధి...**

"దీపం--2" పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హులైన కుటుంబాలకు సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోని 1.08 కోట్ల గ్యాస్ కనెక్షన్లను లక్ష్యంగా తీసుకుని అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా కుటుంబాలపై గ్యాస్ వ్యయభారం తగ్గించి, సాధారణ ప్రజలకు ఆర్థిక ఊరటనందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ పథకం కింద ఇప్పటివరకు పలు విడతల్లో భారీ స్థాయిలో సబ్సిడీని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. మొదటి విడతలో 97.36 లక్షల సిలిండర్లకు రూ.764 కోట్ల సబ్సిడీ, రెండో విడతలో 93.83 లక్షల సిలిండర్లకు రూ.777 కోట్లు, మూడో విడతలో 94.81 లక్షల సిలిండర్లకు రూ.791 కోట్లు, నాలుగో విడతలో 92.28 లక్షల సిలిండర్లకు రూ.760 కోట్ల రాయితీ నేరుగా ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఐదో విడత అమలుకు ఇప్పటికే ఆయిల్ మార్కెటింగ్ సంస్థలకు రూ.300 కోట్లు అడ్వాన్సుగా విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. దేశంలోనే అత్యంత విస్తృత స్థాయిలో అమలవుతున్న సంక్షేమ పథకాలలో "దీపం--2" ఒకటిగా నిలిచి, కోట్లాది కుటుంబాలకు ప్రత్యక్ష ఆర్థిక లబ్ధి చేకూరుస్తోందని మంత్రి తెలిపారు.

**స్మార్ట్ రేషన్ కార్డులు -- వినూత్న డిజిటల్ సంస్కరణ...**

ప్రజలకు మరింత పారదర్శకమైన, సులభమైన మరియు సాంకేతిక ఆధారిత సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వినూత్న డిజిటల్ సంస్కరణగా ~= కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.49 కోట్ల కుటుంబాలకు ఈ స్మార్ట్ కార్డులు అందజేసినట్లు తెలిపారు.
సాంకేతికతను ప్రజా సంక్షేమంతో అనుసంధానిస్తూ, దళారుల జోక్యానికి అవకాశం లేకుండా, నిజమైన లబ్ధిదారులకు సేవలు చేరే విధంగా అమలు చేస్తున్న ఈ స్మార్ట్ రేషన్ కార్డులు దేశంలోనే ఒక ఆదర్శవంతమైన సంస్కరణగా నిలిచిందని ఆయన తెలిపారు.

**వృద్ధులు - దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సేవ...**

సామాజిక భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ, దేశంలోనే తొలిసారిగా వృద్ధులు మరియు దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేసే వినూత్న కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16.88 లక్షల మంది వృద్ధులు, దివ్యాంగులకు ఈ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, రేషన్ డీలర్లు జు-ాూా పరికరాలతో నేరుగా వారి ఇళ్ల వద్దకు వెళ్లి బయోమెట్రిక్ ధృవీకరణ అనంతరం సరుకులు అందిస్తున్నారని పేర్కొన్నారు.

## ఔరంగాబాద్ ప్రమాద బాధితులను ఆదుకుంటాం

### కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



బీహార్ సింధూర దర్శిని: బీహార్ లోని ఔరంగాబాద్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో రాష్ట్రానికి చెందిన ముగ్గురు మరణించడం, మరో 15 మంది తీవ్రంగా గాయపడిన ఘటన తనను ఎంతగానో కలచివేసిందని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత నెల్లూరు పరిసర ప్రాంతాలకు చెందిన 43మందితో కాశికి ప్రయాణిస్తున్న టూరిస్టు బస్సు.. ఔరంగాబాద్ వద్ద లారీని డీ కొట్టడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఔరంగాబాద్ కలెక్టర్ అభిలాష శర్మతో రామ్మోహన్ నాయుడు చరవాణీ ద్వారా సంప్రదించారు. ఘటన జరగడానికి గల కారణాలు, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సదుపాయాల గురించి ఆరా తీశారు. మెరుగైన వైద్యాన్ని క్షతగాత్రులకు చేరువ చెయ్యాలని, ఇందుకోసం అవసరమైతే విమానయానాన్ని కూడా వాడుకోవాలని సూచించారు. తన వ్యక్తిగత సిబ్బందిని కూడా ఈ ఘటన సహాయక చర్యల్లో భాగస్వామ్యం చేసినట్టు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపిన రామ్మోహన్ నాయుడు.. క్షతగాత్రులు అంతా ధైర్యంగా ఉండాలని కోరారు.

## దోబీ ఘాట్ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించాలి

### కమిషనర్ వై ఓ. నందన్



నెల్లూరు (సింధూర దర్శిని) 8 జూన్ నెల్లూరు జిల్లా ; నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ స్థానిక సంతపేట ప్రాంతంలోని ధోబిఘాట్ ను ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి సోమవారం సందర్శించారు.ధోబీ ఘాట్ ప్రాంతంలో రజక వృత్తి నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులను పరిశీలించి అధికారులకు వివిధ సూచనలను జారీ చేశారు.

అనంతరం సమీపంలో వీధి కుక్కల ఆహారం కోసం ఏర్పాటుచేసిన ప్రదేశాన్ని కమిషనర్ పరిశీలించారు. బహిరంగ ప్రదేశాలలో కుక్కలకు ఆహార పదార్థాలు అందించకుండా ప్రజలకు అవగాహన కల్పించి, నిర్దేశించిన ఇలాంటి ప్రదేశాలలో మాత్రమే ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రహంతు జానీ, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి పరీక్షలను ప్రజలు స్వయంగా పరిశీలించవచ్చు


### కమిషనర్ వై ఓ. నందన్



నెల్లూరు (సింధూర దర్శిని) 8జూన్ నెల్లూరు జిల్లా; నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలోని హెడ్ వాటర్ వర్క్స్ ను అధికారులతో కలిసి సోమవారం సందర్శించారు. ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నుంచి తాగునీటి శాంపిల్లను సేకరించి నాణ్యత పరీక్షలను కమిషనర్ సమక్షంలో పి.పి.ఎమ్ కిట్ల ద్వారా అధికారులు నిర్వహించారు. ఫలితాల అనంతరం తాగునీటి రంగు, వాసనలను కమిషనర్ పరిశీలించి, నీటిని తాగిన అనంతరం సంతృప్తిని వ్యక్తం చేశారు.తాగునీటి నాణ్యత పై ప్రజలకు ఏవైనా సందేహాలు ఉంటే ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల వద్ద క్రమం తప్పకుండా జరిపే తాగునీటి పరీక్షలను స్వయంగా పరిశీలించవచ్చని కమిషనర్ ప్రకటించారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రహంతు జానీ, అమెనిటీస్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపి పార్టీ అవినీతి లేని పాలన అందిస్తుంది

### మాజీ ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు



గూడూరు( సింధూర దర్శిని) 8 జూన్ నెల్లూరు జిల్లా; గూడూరు ప్రజల కోరిక నెల్లూరు జిల్లాలో కలవడం అధికారికంగా జిల్లా మార్పు జరిగిందని దీనికి ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని రాబోయే రోజుల్లో బూత్ లెవెల్ స్థాయిలో కూడా బిజెపి పార్టీని పటిష్టం చేయాలని మాజీ ఎమ్మెల్యే బిజెపి నాయకులు వెలగపల్లి వరప్రసాద్ వెల్లడించారు.గూడూరు పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో సోమవారం బిజెపి నియోజక వర్గ క్రియాశీలక కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే నాయకులు వెలగపల్లి వరప్రసాద్ విచ్చేసి మాట్లాడుతూ గూడూరు ప్రజల ఆకాంక్ష నెల్లూరు జిల్లాలో కలవడం అని కూటమి ప్రభుత్వం జిల్లా మార్పు చేసిందని నేటి నుండి అధికారికంగా మారిందని తెలిపారు. ఈ సమావేశంలో సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, బాలకృష్ణ నాయుడు, పనబాక కోటేశ్వరరావు, దయాకర్,ప్రకాష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

సీఎంవో కార్యాలయం, ఢిల్లీ ఆంధ్ర భవన్, బీహార్ అధికారుల సమన్వయంతో బాధితులకు సహాయ సహకారాలు

ముఖ్యమంత్రి ఆదేశాలతో మృతదేహాల తరలింపునకు ప్రత్యేక విమానం

క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు

బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం



నెల్లూరు ( సింధూర దర్శిని) 8 జూన్ నెల్లూరు జిల్లా ; బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లా యాత్రికులు మృతి చెందడం తీవ్ర విషాదకరమని, బాధితులకు సత్వర సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరు సంతపేటలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గయా నుంచి వారణాసికి వెళ్తున్న యాత్రికుల బస్సు ఔరంగాబాద్ సమీపంలో లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఈ బస్సులో సంగం, ఆత్మకూరు, దుత్తలూరు ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రయాణిస్తున్నారని, ఉదయం 5 గంటల సమయంలో ప్రమాద సమాచారం తనకు అందిందని చెప్పారు. బస్సులో మొత్తం 45 మంది ప్రయాణిస్తున్నారని, వారిలో ఇద్దరు డ్రైవర్లు, ఒక వంటమనిషి, 42 మంది యాత్రికులు ఉన్నట్లు తెలిపారు. ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, 15 మంది గాయపడ్డారని వెల్లడించారు. మృతి చెందిన వారిలో టూర్ అటెండెంట్, వంటమనిషి, ఒక మహిళా యాత్రికురాలు ఉన్నారని చెప్పారు.సమాచారం అందిన వెంటనే జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రి కార్యాలయం, ఢిల్లీలోని ఆంధ్రభవన్ కమిషనర్‌కు సమాచారం ఇచ్చి సహాయక చర్యలు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘటన పై వెంటనే స్పందించి బాధితులకు అత్యవసర సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారని వెల్లడించారు.

**ప్రత్యేక విమానంలో మృతదేహాల తరలింపు**

గయా నుంచి నెల్లూరు జిల్లాకు రోడ్డు మార్గంలో రావడానికి 38 గంటలకు పైగా సమయం పడుతుందని, ఈ నేపథ్యంలో మృతి చెందిన ముగ్గురు యాత్రికుల మృతదేహాలను సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో గయా నుంచి రేణిగుంట విమానాశ్రయానికి తీసుకువస్తామని మంత్రి తెలిపారు. అక్కడి నుంచి జిల్లా అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక వాహనాల ద్వారా వారి స్వగ్రామాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

**క్షతగాత్రులకు వైద్య సేవలు**

ప్రమాదంలో గాయపడిన 15 మంది యాత్రికులకు గయాలోని మెడికల్ కాలేజీలో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. క్షతగాత్రులను కూడా ప్రత్యేక విమానంలో చెన్నైకి తీసుకువచ్చి, అక్కడి నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా అధికారుల సహకారంతో నెల్లూరు జిల్లాకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

**కంట్రోల్ రూమ్ ఏర్పాటు – నిరంతర పర్యవేక్షణ**

ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి బీహార్ అధికారులతో సమన్వయం కొనసాగిస్తున్నామని మంత్రి తెలిపారు. ఢిల్లీలోని ఆంధ్రభవన్ కమిషనర్ ఆధ్యా శ్రీకాంత్ బీహార్ ప్రభుత్వ అధికారులతో, సీఎంవో అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని సమీక్షిస్తున్నారని చెప్పారు.

**తెలుగు అధికారుల సహకారంతో ఘటనా స్థలంలో సహాయక చర్యలు**

బీహార్‌లో పనిచేస్తున్న సీనియర్ తెలుగు ఐఏఎస్ అధికారి డా. రాజేందర్ కుమార్, ఐపీఎస్ అధికారి వివేక్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని మంత్రి వెల్లడించారు.

**మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి**

ఈ ప్రమాదంలో మొత్తం ముగ్గురు భక్తులు మృతి చెందడం అత్యంత బాధాకరమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని సంగం, ఆత్మకూరు, ఉదయగిరి నియోజక వర్గంలోని దుత్తలూరు నుంచి ఈనెల 1న ప్రైవేట్ బస్సులో గయా, వారణాసి యాత్రకు వెళ్లిన భక్తులు ప్రమాదానికి గురికావడం తీవ్ర విచారం కలిగించిందన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మంత్రి, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారికి అవసరమైన వైద్య సహాయం అందేలా అధికారులు నిరంతరం చర్యలు చేపడుతున్నారని తెలిపారు.

**ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది**

ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి పశ్చిమ గోదావరి జిల్లా పర్యటన ముగిసిన అనంతరం పరిహారం అంశంపై నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందన్నారు.దూర ప్రాంతంలో జరిగిన ఈ విషాద ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర వేదనలో ఉన్నారని, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం పొందాలని ఆకాంక్షించారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం మానసిక ప్రశాంతత

జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు

రామతీర్థం సాగర తీరంలో సామూహిక యోగా కార్యక్రమానికి విశేష స్పందన



నెల్లూరు (సింధూర దర్శిని) 8 జూన్ నెల్లూరు జిల్లా ; యోగా ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21)ను పురస్కరించుకుని నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా విడవలూరు మండలం రామతీర్థం సాగర తీరం వద్ద ఆదివారం నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ప్రకృతి సోయగాల నడుమ, అలల సవ్వడుల మధ్య యోగా ఔన్నత్యం ఉట్టిపడేలా నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. అందమైన సాగర తీరం, ఆహ్లాదకరమైన వాతావరణంలో జాయింట్ కలెక్టర్, వివిధ శాఖల అధికారులు, యోగా సాధకులు, ప్రజలు సామూహికంగా యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఆధునిక జీవనశైలిలో ఏర్పడుతున్న అనారోగ్య సమస్యలను అధిగమించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యతను పెంపొందించే గొప్ప సాధనం యోగా అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించి ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

**యోగాసనాల ప్రాముఖ్యత వివరించిన యోగా గురువులు**

యోగా గురువులు డా. స్వప్న, జయంతి, యోషిత యోగాలోని ప్రతి ఆసనం ప్రాముఖ్యత, వాటి ఆరోగ్య ప్రయోజనాలను వివరంగా తెలియజేస్తూ యోగాసనాలు చేయించారు. యోగా ద్వారా శారీరక సామర్థ్యం పెరగడంతో పాటు మానసిక ఒత్తిడి తగ్గి జీవన నాణ్యత మెరుగుపడుతుందని వివరించారు. ప్రకృతి ఒడిలో నిర్వహించిన ఈ యోగా కార్యక్రమం పాల్గొన్న వారిలో నూతన ఉత్సాహాన్ని నింపింది. సముద్ర అలల హోరు, స్వచ్ఛమైన గాలి మధ్య యోగాసనాలు వేయడం ద్వారా ప్రత్యేక అనుభూతిని పొందామని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం యోగా పట్ల ప్రజల్లో మరింత అవగాహన, ఆసక్తిని పెంపొందించింది.యోగాను ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం చేయాలనే లక్ష్యంతో జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర-2026 కార్యక్ర మాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో యోగా పట్ల చైతన్యం కల్పిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి, ఐటిడిఏ పీఓ శ్రీనివాసరావు, ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాసరాజు, జిల్లా పర్యటక శాఖ అధికారి ఎస్.కె హజర్ అలీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, ఐసిడిఎస్ పిడి హేనా సుజన్, మత్స్యశాఖ అధికారి చాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: ఎమ్మెల్సీ మేరీగా మురళీధర్

గూడూరు (సింధూర దర్శిని) 8 జూన్ నెల్లూరు జిల్లా; రాష్ట్రంలో పరిపాలిస్తున్న ప్రస్తుత ప్రభుత్వం గడిచిన రెండు సంవత్సరాలలో ఒక కొత్త పెన్షన్ కూడా మంజూరు చేసిన దాఖలాలు లేవని గూడూరు నియోజకవర్గం వైసిపి ఇంచార్జ్, ఎమ్మెల్సీ మేరీగ మురళీధర్ విమర్శించారు. గూడూరు పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్సీ మురళీధర్ మీడియా సమావేశం నిర్వహించారు .గూడూరు పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ మురళీధర్ వైసీపీ నాయకులతో సమావేశం నిర్వహించి , పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు హామీగా ఇచ్చిన సూపర్ సిక్స్



పథకాలు సంపూర్ణంగా అమలు కావడం లేదని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో మంజూరైన మెడికల్ కాలేజీ లను టిడిపి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేస్తూ పేద ప్రజలకు వైద్య సదుపాయాలు దూరం చేస్తున్నారని ఆయన విమర్శించారు . టిడిపి ఇచ్చిన హామీల్లో భాగంగా నిరుద్యోగ యువతకు హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు . ఈనెల 12వ తేదీన ప్రజల పక్షాన వైసిపి నిరసన ర్యాలీ నిర్వహిస్తుందని ఈ ర్యాలీలో వైసీపీ శ్రేణులు అందరూ పాల్గొని ప్రజల నిరసనను ప్రభుత్వానికి తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజవర్గ పరిధిలోని పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ విశ్వనాథ స్వామికి రుద్రాభిషేకం

మనుబోలు (సింధూర దర్శిని) 8 జూన్ నెల్లూరు జిల్లా ; మనుబోలు చెర్లోపల్లి రైల్వే గేట్ సమీపాన వెలసి ఉన్న శ్రీ విశ్వనాథ స్వామి వారి యొక్క దేవస్థానం వద్ద సోమవారం సందర్భంగా పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా గంధళ్ళ కృష్ణయ్య అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు.



# సురక్షిత మాతృత్వానికి భరోసా: పీఎమ్ఎస్ఎమ్ఏ దశాబ్ద కాలపు ప్రగతి



సురక్షితమైన గర్భధారణ, మహిళల పట్ల ఆ దేశానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనం. భారతదేశం లాంటి సుమారు 2.9 కోట్ల వార్షిక గర్భధారణలు జరిగే దేశంలో, ఈ స్థాయిలో సురక్షిత మాతృత్వాన్ని అందించాలంటే పటిష్టమైన ఆరోగ్య వ్యవస్థలు, స్థిరమైన రాజకీయ సంకల్పం, సకాలంలో స్పందన, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందరికీ సమానంగా అందడం ఎంతో అవసరం. గత దశాబ్ద కాలంలో భారతదేశంలో మాతృ మరణాలు గణనీయంగా తగ్గడం దేశ ప్రజారోగ్య రంగంలో సాధించిన గొప్ప విజయాలలో ఒకటిగా నిలిచింది. మాతృ ఆరోగ్యంపై నిరంతర పెట్టుబడులు, సేవా వితరణ వ్యవస్థలను బలోపేతం చేయడం, సమాజ భాగస్వామ్యం, గర్భధారణ ప్రయాణంలో ప్రతి మహిళకు నాణ్యమైన వైద్యం అందేలా చూసుకోవాలనే నిరంతర సంకల్పం వల్లే ఈ పురోగతి సాధ్యమైంది. ఈ గొప్ప మార్పునకు కేంద్ర బిందువు 'ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్' (ప్రమీహీహా). దేశవ్యాప్తంగా సురక్షితమైన మాతృత్వాన్ని పెంపొందించడంలో ఈ పథకం ఇప్పుడు పదేళ్ల మైలురాయిని చేరుకుంది. గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ఆలోచనల నుంచి పుట్టిన ఈ పథకాన్ని 2016 జూన్ 9న ప్రారంభించారు. గర్భిణీ స్త్రీలందరికీ గర్భధారణ రెండో, మూడో త్రైమాసికాల్లో, ప్రతి నెల 9వ తేదీన ఉచితంగా, సమగ్ర, నాణ్యమైన ప్రసవ పూర్వ ఆరోగ్య పరీక్షలను అందించే దేశవ్యాప్త ఉద్యమంగా పీఎమ్ఎస్ఎమ్ఏ (ప్రమీహీహా) రూపాంతరం చెందింది. ప్రతీ నెల '9వ తేదీ' ని ఎంచుకోవడం వెనుక ఓ ఆలోచన ఉంది. గర్భధారణ 9 నెలల అమూల్యమైన ప్రయాణం; ప్రతి నెలా ఒక కొత్త ఆశను, నిరీక్షణను, బాధ్యతను మోసుకొస్తుంది. ప్రతి నెల 9వ తేదీని మాతృత్వ ఆరోగ్యానికి అంకితం చేయడం ద్వారా, గర్భం దాల్చినప్పటి నుంచి ఆరోగ్యకరమైన బిడ్డ సురక్షితంగా జన్మించే వరకు తొమ్మిది నెలల పాటు నిరంతర సంరక్షణ, పర్యవేక్షణ, మద్దతు అవసరమనే విషయాన్ని పీఎమ్ఎస్ఎమ్ఏ (ప్రమీహీహా) గుర్తుచేస్తుంది. ఏ గర్భధారణ కూడా పూర్తిగా ప్రమాదం లేనిది కాదనే నిజం.. మాతృ ఆరోగ్య సంరక్షణలో అత్యంత కీలకమైన అంశం. ఈ రోజు సాధారణంగా, ఆరోగ్యంగా కనిపించే గర్భం, రేపు అకస్మాత్తుగా తీవ్రమైన సంక్లిష్టతలకు దారితీయవచ్చు. ఏ గర్భధారణ అయినా ముందస్తు హెచ్చరికలు ఏవీ లేకుండానే అకస్మాత్తుగా అధిక ముప్పుగా మారే అవకాశం ఉందని ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎమ్ఎస్ఎమ్ఏ) గుర్తించింది. అందుకే, ప్రమాదాలను ముందే కనుగొని, వాటిని నిరంతరం పర్యవేక్షిస్తూ, సకాలంలో పెద్ద ఆసుపత్రులకు పంపడం మరియు చికిత్సను అందించడం కోసం ఈ పథకం ఒక సరళమైన కానీ విప్లవాత్మకమైన విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇలా అధిక ముప్పు ఉన్న గర్భధారణలను ముందే గుర్తించడం వల్ల.. ఒక మాతృ మరణాన్ని, పురిటిపాప మరణాన్ని, నవజాత శిశువు ఆరోగ్య సమస్యలను లేదా జీవితకాల వైకల్యాన్ని నివారించే అవకాశం లభిస్తుంది. సమస్యలు తీవ్రమైన తర్వాత చికిత్స చేయడం కంటే, సమస్యలను ముందే రాకుండా నివారించడంపై దృష్టి పెట్టడం ద్వారా పీఎమ్ఎస్ఎమ్ఏ భారతదేశ మాతృ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసింది. తద్వారా దేశంలోని కోట్ల మంది మహిళలకు గర్భధారణ ప్రయాణాన్ని సురక్షితంగా మార్చింది. పీఎమ్ఎస్ఎమ్ఏ ప్రధాన బలం ఏమిటంటే.. ఇది దేశవ్యాప్తంగా ఒక నిర్దిష్టమైన రోజున, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ప్రసవ పూర్వ సంరక్షణ సేవలను అందించే ఒక నమ్మకమైన వేదికను ఏర్పాటు చేసింది. దీనివల్ల మాతృ ఆరోగ్య సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం, నిరంతరాయంగా సేవలు అందే వీలు కలిగింది. ఈ కార్యక్రమం కింద గర్భిణీ స్త్రీలను పరీక్షించి.. తీవ్రమైన రక్తహీనత, రక్తపోటు, గర్భధారణ సమయంలో వచ్చే మధుమేహం, ఇన్ఫెక్షన్లు వంటి సమస్యలను గుర్తిస్తారు. సకాలంలో గుర్తించకపోతే తల్లి, బిడ్డ ప్రాణాలకే ముప్పు తెచ్చే అవకాశం ఉన్న దాదాపు 25 రకాల అధిక ముప్పు పరిస్థితులను ఈ పథకం ద్వారా ముందే స్క్రీనింగ్ చేసి గుర్తిస్తారు.

అధిక ముప్పు ఉన్న గర్భాలకు సాధారణ పరీక్షల కంటే అదనపు పర్యవేక్షణ అవసరమని స్పష్టమవడంతో.. భారత ప్రభుత్వం 2022లో 'ఎక్స్‌టెండెడ్ పీఎమ్ఎస్ఎమ్ఏ' (జు-ప్రమీహీహా) వ్యూహాన్ని ప్రారంభించి ఈ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేసింది. దీని కింద, అధిక ముప్పు ఉన్న గర్భిణీ స్త్రీలకు సురక్షితమైన ప్రసవం జరిగేలా చూసేందుకు సాధారణ పరీక్షలతో పాటు అదనపు తదుపరి ఆరోగ్య సందర్శనలు ఉంటాయి. ఈ చొరవ ద్వారా గర్భిణుల వ్యక్తిగత స్థాయి పర్యవేక్షణ విధానాన్ని ప్రవేశపెట్టారు. అలాగే ప్రసవం జరిగిన తర్వాత 45వ రోజు వరకు నిరంతర పర్యవేక్షణ యంత్రాంగాన్ని పటిష్టం చేశారు. దీనివల్ల క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న మహిళలకు గర్భధారణ సమయంలోనూ, ప్రసవానంతర కాలంలోనూ నిరంతరాయంగా సంరక్షణ అందుతుంది. ఇలా అధిక ముప్పు ఉన్న గర్భిణులను అదనపు తనిఖీల కోసం ఆసుపత్రులకు తీసుకువచ్చే ఆశా కార్యకర్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలను అందించడం ద్వారా, సకాలంలో వైద్య సహాయం అందించే విధానాన్ని, నిరంతర సంరక్షణను ప్రభుత్వం మరింత బలోపేతం చేసింది. ఈ పథకం అమలు, పర్యవేక్షణ, జవాబుదారీతనాన్ని మరింత మెరుగుపరచడానికి భారత ప్రభుత్వం ఒక కేంద్రీకృత 'పీఎమ్ఎస్ఎమ్ఏ డిజిటల్ పోర్టల్'ను అభివృద్ధి చేసింది. ఇది దేశవ్యాప్తంగా కార్యక్రమ నిర్వహణకు వెన్నెముకగా పనిచేస్తోంది. ఈ పోర్టల్ ద్వారా సేవలు అందించే విధానానికి సంబంధించిన తాజా నివేదికలు, అధిక ముప్పు ఉన్న గర్భాల ప్రత్యేక పర్యవేక్షణ మరియు జాతీయ, రాష్ట్ర స్థాయిలలో సమాచారం ఆధారంగా కీలక నిర్ణయాలు తీసుకోవడం సాధ్యమవుతుంది. ముఖ్యంగా, ప్రైవేట్ రంగ నిపుణులు, సమాజ స్వచ్ఛంద సేవకులు కూడా ఇందులో భాగస్వాములు కావడానికి ఈ వేదిక అనుమతిస్తుంది. ఇది గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి 'జన భాగస్వామ్యం' అనే ఆలోచనను ప్రతిబింబిస్తుంది. పీఎమ్ఎస్ఎమ్ఏ సాధించిన విజయం భారతదేశ మాతృ ఆరోగ్య వ్యవస్థలోని వివిధ పథకాల పరస్పర సమన్వయాన్ని ఎత్తి చూపుతుంది. జనని సురక్ష యోజన, జనని శిశు సురక్ష కార్యక్రమం, సురక్షిత మాతృత్వ ఆశ్వాసన్, జాతీయ నాణ్యత ప్రమాణాల హామీ, పోషణ్ అభియాన్, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన, ఆయుష్మాన్ భారత్, మిడ్‌వైఫరీ సేవలు, ప్రసవానంతర సంరక్షణ మెరుగుదల వంటి ఇతర కార్యక్రమాలతో కలిసి పనిచేస్తూ.. గర్భధారణ, ప్రసవం, ప్రసవానంతర కాలంలో మహిళలకు ఒక సంపూర్ణ రక్షణ వలయాన్ని నిర్మించడంలో పీఎమ్ఎస్ఎమ్ఏ తోడ్పడింది.

ఈ విప్లవాత్మక మార్పుల వెనుక మన క్షేత్రస్థాయి ఆరోగ్య కార్యకర్తలు – ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, సహాయక నర్స్ మిడ్‌వైఫ్‌లు (ఊచీవీం), కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (జనూం), నర్సులు, మిడ్‌వైఫ్‌లు, ఆరోగ్యశాఖ అధికారులు ఉన్నారు. సమాజాన్ని చైతన్యపరచడం, కౌన్సెలింగ్, స్క్రీనింగ్, రిఫరల్, తదుపరి పర్యవేక్షణ సేవల్లో వారు చేస్తున్న అలసట లేని కృషి వల్లనే దేశంలోని అత్యంత దూర ప్రాంతాలు, వెనుకబడిన ప్రాంతాలలోని మహిళలకు సైతం మాతృ ఆరోగ్య సేవలు అందుతున్నాయి.

ఈ సమష్టి కృషి ఫలితాలు నేడు జాతీయ ఆరోగ్య సూచీలలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. తాజా శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ 2022–24 అంచనాల ప్రకారం, భారతదేశ మాతృ మరణాల రేటు ప్రతి 1,00,000 సజీవ జననాలకు 87 కు తగ్గింది. దీనివల్ల 2030 నాటికి మాతృ మరణాల రేటును 70 కంటే తగ్గించాలనే సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ాణ+) వైపు భారతదేశం చాలా వేగంగా దూసుకుపోతోంది. ఈ ప్రగతి ఇతర మాతృ ఆరోగ్య సూచికలలో కూడా ప్రతిబింబిస్తోంది. ఇటీవల విడుదలైన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (చీఖీనూ–6, 2023–24) ప్రకారం, ఆసుపత్రి ప్రసవాలు చీఖీనూ–5 (2019–21) లోని 88.6% నుంచి 90.6% కి పెరిగాయి. అదే సమయంలో ప్రసవ పూర్వ సంరక్షణ కవరేజ్ 92.6% నుండి 95.9% కి మెరుగైంది. ప్రపంచంలోనే అతిపెద్ద వార్షిక జననాల సంఖ్యను నిర్వహిస్తూ కూడా ఈ స్థాయి ప్రగతిని సాధించడమనేది భారతదేశ మాతృ ఆరోగ్య కార్యక్రమాల సమర్థతను చాటి చెబుతోంది.

2016 లో ప్రారంభమైనప్పటి నుంచి, ఈ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా 7.5 కోట్లకు పైగా ప్రసవ పూర్వ తనిఖీలు జరిగాయి. ముఖ్యంగా, పీఎమ్ఎస్ఎమ్ఏ ద్వారా 1.17 కోట్లకు పైగా అధిక ముప్పు ఉన్న గర్భాలను ముందే గుర్తించడం సాధ్యమైంది. ఈ విజయాలు కేవలం సంఖ్యలు మాత్రమే కావు; సమస్యలను ముందే గుర్తించి, నిరంతరం పర్యవేక్షించి, నాణ్యమైన వైద్య సేవలతో కాపాడిన లక్షలాది మంది తల్లుల, వారి నవజాత శిశువుల ప్రాణాలకు ఇవి ప్రతీకలు.

# గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలి

**జిల్లా అధికారులకు కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వహించాలి**

**ఎప్పటి నుంచో పెండింగ్లో ఉన్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి**

**జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు**

నెల్లూరు (సింధూరదర్శిని) 8 జూన్ నెల్లూరు జిల్లా; కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రజల నుండి అర్జీలను జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్ ,తెలుగు గంగ ప్రత్యేక అధికారి మహేశ్వర రెడ్డి, మెప్మా పి.డి.కిరణ్ కుమార్,ఐటిడిఏ పిఓ శ్రీనివాసరావు,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నాగ శేఖర్ తదితరులు అర్జీ దారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మంగళవారం జిల్లాలో పర్యటించిన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పర్యటనను సంబంధిత అధికారులు విజయవంతం అయ్యేలా తమకు



కేటాయించిన విధులను జాగరుకతతో నిర్వహించి గవర్నర్ పర్యటన విజయవంతం చేయాలని సూచించారు. జిల్లా అధికారులు ఆయా శాఖలకు సంబంధించి పి జి ఆర్ ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను పరిష్కారం అయ్యేలా చూడాలని సదరు విషయాలను సంబంధిత అర్జీదారులకు తెలియజేయాలని ఆయన సూచించారు. అధికారులు ఈ పి టి ఎస్ మరియు పి జి ఆర్ ఎస్ లో అర్జీలను త్వరితగతిన పరిష్కరింప చేయాలన్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు అవసరమైన మౌలిక వసతులతో పాటు ప్రత్యేక క్యూ లైన్ ను ఏర్పాటు చేయడంతో పాటు చలువ పందిళ్లను ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే ఉచిత భోజన సదుపాయాన్ని అందించారు. రెవిన్యూ సంబంధిత విషయాలను పరిష్కరించే విధంగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయడం తో పాటు ప్రాథమిక వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగింది అని అన్నారు.

# పటిష్ట బందోబస్తు ఏర్పాటు: జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు

తిరుపతి ( సింధూర దర్శిని) 8 జూన్ తిరుపతి జిల్లా ; రాష్ట్ర ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి , కేంద్ర మంత్రులు, రాయలసీమ ప్రాంతానికి చెందిన ప్రముఖ రాజకీయ నాయకులు మరియు ఎమ్మెల్యే లు హాజరుకానున్న భారీ బహిరంగ సభకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ అన్ని రకాల భద్రతా, ట్రాఫిక్ ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బ రాయుడు తెలిపారు.సభకు విచ్చేసే వివిఐపీలు, విఐపీలు మరియు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఎన్క్లోజర్లు, ప్రత్యేక ప్రవేశ ద్వారాలు, పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. సుమారు 10 వేల మంది వరకు ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి కూడా ప్రత్యేక పార్కింగ్, సులభ ప్రవేశ



ఏర్పాట్లు కల్పించినట్లు పేర్కొన్నారు. సభను తిరుపతి నగర పరిధి వెలుపల నిర్వహించడం వల్ల నగర ప్రజలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం ఉండదని ఎస్పీ స్పష్టం చేశారు. నగరంలో ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టామని తెలిపారు.సభ నిర్వహణ, భద్రతా పర్యవేక్షణ కోసం దాదాపు 800 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. అనంతరం బందోబస్తు పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి బందోబస్తు, భద్రతపై సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకటరావు, రవి మనోహర్ ఆచారి , రామకృష్ణ (తిరుమల) శ్రీనివాసులు (క్రైమ్స్) కులశేఖర్ (రెడ్ శాండిల్) శ్రీలత (మహిళా పోలీస్ స్టేషన్ )మరియు డీఎస్పీలు సిఐలు పాల్గొన్నారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి తోడ్పడాలని జిల్లా ఎస్పీ కోరారు.

# రైతులకు పారదర్శకంగా ఎరువుల సరఫరా

**సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నంబర్ 155251**

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**



నెల్లూరు(సింధూరదర్శిని) 8 జూన్ నెల్లూరుజిల్లా; రైతులకు సకాలంలో, పారదర్శకంగా ఎరువుల సరఫరా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జూన్ 8వ తేదీ నుంచి యాప్ ఆధారిత యూరియా, డి.ఏ.పీ విక్రయ విధానాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఎరువుల సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు జరగడం వల్ల కేటాయించిన యూరియా, డి.ఏ.పీ ఎరువులు అర్హులైన రైతులకు చేరడంతో పాటు విక్రయ ప్రక్రియలో పూర్తి పారదర్శకత నెలకొంటుందన్నారు. కాకినాడ, కృష్ణా జిల్లాలను మినహాయించి మిగిలిన 26 జిల్లాల్లో ఈ విధానం అమలులోకి వచ్చిందని తెలిపారు. సాగు చేసే ప్రతి రైతుకు ఎపిఎయిమ్స్ యాప్ ఆధారిత విక్రయ వ్యవస్థ ద్వారా లబ్ధి చేకూరేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా, ఎరువుల విక్రయాలపై సమగ్ర పర్యవేక్షణ, సరఫరా వ్యవస్థలో పారదర్శకత, నిల్వల నిర్వహణలో సమర్థత పెరుగుతుందని తెలిపారు. యూరియాను వ్యవసాయేతర అవసరాలకు మళ్లించడం, అక్రమ నిల్వలు మరియు దుర్వినియోగాన్ని నివారించడంలో ఈ విధానం కీలకంగా ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలోని రైతులు ఎరువుల కొనుగోలు సమయంలో అవసరమైన వివరాలను అందించి యాప్ ఆధారిత విక్రయ విధానానికి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఎరువుల సరఫరా లేదా విక్రయాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నంబర్ 155 251ను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్నకార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# నిరుపేద వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ: సూపరింటెండెంట్ డా. జరీనా

గూడూరు( సింధూరదర్శిని) 8జూన్ నెల్లూరు జిల్లా; స్థానిక గూడూరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం జరిగింది. 'డా. సి.ఆర్.రెడ్డి ఆరోగ్య సంజీవని' పేరిట ప్రముఖ దాతలు డాక్టర్ సి. జనార్దన్ రెడ్డి, డాక్టర్ సి. రోహిణిల సంపూర్ణ ఆర్థిక సౌజన్యంతో సుమారు 30 మంది బాధితులకు ఈ పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జరీనా మాట్లాడుతూ, తీవ్ర వ్యాధులతో బాధపడే నిరుపేద రోగులకు మందులతో పాటు బలమైన పౌష్టికాహారం ఎంతో అవసరమని, ప్రతి నెలా ఈ సేవలు అందిస్తున్న ప్రగతి సేవా సంస్థను అభినందించారు. అనంతరం ప్రగతి సేవా సంస్థ




అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ, సంస్థ చేపట్టిన మూడు ప్రధాన లైఫ్-టైమ్ ప్రాజెక్టులలో ఎయిడ్స్ బాధితులకు అండగా నిలవడం ఒకటని పేర్కొన్నారు. దానధర్మాల్లో డాక్టర్ సి.ఆర్. రెడ్డి కుటుంబం ఎల్లప్పుడూ ముందే ఉంటుందని కొనియాడారు. బాధితులలో రోగనిరోధక శక్తిని (ఇమ్యూనిటీ) పెంచేందుకు ప్రభుత్వ ఆసుపత్రి మందులతోపాటు ఈ ఆహారం ఎంతో దోహదపడుతుందన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా రోగులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈ ప్రగతి కుటుంబ సభ్యులు వాకాటి రామ్మోహన్ రావు వాచి షాప్ రాము కుమార్ నాయుడు శ్యామ్ రాజశేఖర్ రెడ్డి గోల్డ్ షాప్ కృష్ణ రెడ్డి సోనాలి గోల్డ్ షాప్ మల్లీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తాం

**జిల్లా అడిషనల్ ఎస్పి సౌజన్య**

నెల్లూరు( సింధూర దర్శిని) 8 జూన్ నెల్లూరు జిల్లా ; ప్రజా సమస్యలను సత్వరంగా పరిష్కరించడంతో పాటు, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా విచారించి న్యాయంచేయాలని జిల్లా అడిషనల్ ఎస్పి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా వినతులు పునరావృతం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.సోమవారం జిల్లా ఇంచార్జి ఎస్పి వి. హర్షవర్ధన్‌రాజు ఆదేశాలు మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ మరియు ఇతర అధికారుల సమక్షంలో నిర్వహించిన "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి 133 ఫిర్యాదులు స్వీకరించారు.ప్రజా ఫిర్యాదుల పట్ల



ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదు. ప్రజలతో మర్యాదపూర్వకంగా, జవాబుదారీతనంతో వ్యవహరించాలి. ప్రతి పిటిషన్‌ను సమగ్రంగా విచారించి త్వరితగతిన పరిష్కరించాలి. బాధితులకు చట్టపరమైన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలి. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్పి మాట్లాడుతూ, వచ్చిన ప్రతి ఫిర్యాదుపై చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్.పి.అడ్మిన్ సౌజన్య తో పాటు, డీటీసీ గిరిధర్ యస్బి ధీరజ్ వినీల్, సీఐ సుబ్బా రావు సీఐ భక్తవత్సల రెడ్డి మరియు పీజీఆర్ఎస్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు విస్తృత ఏర్పాట్లు: కలెక్టర్




తిరుపతి( సింధూర దర్శిని) 8 జూన్ తిరుపతి జిల్లా; రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 9వ తేదీన తిరుపతి జిల్లా పర్యటన సందర్భంగా ఏర్పాట్లను పగడ్బందీగా చేపట్టాలనీ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా స్థానిక దామినేడు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ముఖ్యమంత్రి హాజరుకానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ జిల్లా ఎస్ పి ఎల్ .సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ గోవిందరావు, చంద్రగిరి, తిరుపతి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరని శ్రీనివాసులు, టిటిడి బోర్డు మెంబర్ పనబాక లక్ష్మి, తిరుపతి ఎం ఎల్ ఏ ఆరని శ్రీనివాసులు, శాప్ చైర్మన్ రవి నాయుడులతో కలిసి పరిశీలించారు. విధులు కేటాయించిన అధికారులు బాధ్యతగా నిర్వహించాలని, ఎలాంటి లోటు పాట్లు లేకుండా భద్రత ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. పర్యటన సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, అత్యవసర సదుపాయాలు, భద్రతా చర్యలు మరియు ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, ప్రజాప్రతినిధులు, పోలీసు, రెవెన్యూ మరియు ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన ఆహారాన్ని అందించాలి

శ్రీకాళహస్తి (సింధూర దర్శిని) 8 జూన్ తిరుపతి జిల్లా; శ్రీకాళహస్తి మండలంలోని జెడ్పీహెచ్ బాలుర ఉన్నత పాఠశాలలో కుక్ కమ్ హెల్పర్లకు పోషకాహార శిక్షణ




శ్రీకాళహస్తి మండలంలోని జెడ్పీహెచ్ బాలుర ఉన్నత పాఠశాల లో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, టాటా ట్రస్ట్స్ సహకారంతో కుక్ కమ్ హెల్పర్లకు పోషకాహారం, ఆహార భద్రత మరియు ఫోర్టిఫైడ్ ఆహార పదార్థాల వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎంఈఓ-1 ఆర్. భువనేశ్వరి మేడం, ఎంఈఓ-2 ఎ. బాలయ్య జెడ్పీహెచ్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం టి. వెంకటయ్య ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మరియు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం అత్యంత ముఖ్యమని వారు పేర్కొన్నారు. టాటా ట్రస్ట్స్ ప్రోగ్రామ్ అసోసియేట్లు వి. లక్ష్మి మరియు వరలక్ష్మి ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి, సమతుల ఆహారం, పోషకాహార లోపాలు, రక్తహీనత నివారణ, ఫోర్టిఫైడ్ బియ్యం, అయోడైజ్డ్ ఉప్పు వినియోగం, పరిశుభ్రత మరియు ఆహార భద్రత అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కుక్ కమ్ హెల్పర్లతో వంటల పోటీలు నిర్వహించారు. పోటీలలో పాల్గొన్న వారు వివిధ రకాల పోషకాహార వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. ఉత్తమంగా ప్రతిభ కనబరిచిన ఆరుగురు విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కుక్ కమ్ హెల్పర్లు శిక్షణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, విద్యార్థులకు మరింత నాణ్యమైన పోషకాహారాన్ని అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# విద్యార్థినులకు అభినందన అవార్డులు

రాజమహేంద్రవరం ( సింధూర దర్శిని) జూన్ నంద్యాల జిల్లా ; చైతన్య సారస్వత పరిషత్ సౌజన్యంతో, అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించబడిన 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలులి లో భాగంగా రాజమండ్రి వేదిక మీద కవిసమ్మేళనం – తెలుగు కవితా పోటీ ఘనంగా జరిగింది. గ్లోబల్ యూనివర్సిటీ అధినేత కె.వి.వి సత్యనారాయణరాజుగారు ( చైతన్యరాజు ) సౌజన్యంతో, అక్షర తపస్వి, సాహిత్య భూషణ్, నిరంతర సాహితీ యోధుడు, కళారత్న కత్తిమండ ప్రతాప్ కుమార్ సారథ్యంలో ఈ మహాసభలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబడ్డాయి.ఈ అంతర్జాతీయ స్థాయి వేదిక మీద రాజమహేంద్రవరంకు చెందిన శిక్షణా కేంద్రం విద్యార్థినులు మేఘన, యామిని, దివ్య పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారు. వారు తమ స్వీయ రచిత తెలుగు కవితలతో సభికులను, సీనియర్ కవులను, సాహితీప్రియులను ఆకట్టుకున్నారు. వారి భావగర్భిత రచన, సహజమైన ఆలాపనకు సభలో చప్పట్లు మారుమోగాయి.విద్యార్థినుల ప్రతిభను గుర్తించిన నిర్వాహకులు వారికి అభినందన అవార్డులు మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ అవార్డులను రిటైర్డ్ డీఈవో డాక్టర్ పార్థసారధి , శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ కుమార్ , శ్రీ శ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షులు ఈశ్వరి భూషణం వారి చేతుల మీదుగా ప్రదానం చేశారు.ఈ సందర్భంగా కళావేదిక బృందం ఈ పిల్లలను, వారి సొంత ప్రతిభను




ప్రశంసించి, వారి విజయవంతమైన కెరీర్ మరియు తెలుగు సాహిత్యంలో వారి పయనానికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థినుల విజయానికి వారి తల్లిదండ్రులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# గ్యాస్ బిల్లును సగం తగ్గించే నిపుణుల స్మార్ట్ చిట్కాలు ఇవే!



గృహ వినియోగ గ్యాస్ సిలిండర్‌పై ఇటీవల రూ 29 పెంపు

ఎల్పీజీ వినియోగాన్ని 50శాతం తగ్గించుకునేలా నిపుణుల చిట్కాలు

ప్రెషర్ కుక్కర్ వాడకం, ముందే నానబెట్టడం

ద్వారా వంట సమయం,గ్యాస్ ఆదా

దేశవ్యాప్తంగా వంటగ్యాస్ ధరలు మరోసారి పెరిగి సామాన్యుడి బడ్జెట్‌ను దెబ్బతీస్తున్న తరుణంలో, వంటగది ఖర్చులను నియంత్రించుకోవడానికి నిపుణులు ఒక అద్భుతమైన మార్గాన్ని చూపిస్తున్నారు. ప్రముఖ హెల్త్ అండ్ న్యూట్రిషన్ నిపుణులు డాక్టర్ నందితా అయ్యర్ సూచించిన కొన్ని శాస్త్రీయ చిట్కాలను పాటిస్తే, మన ఇంట్లోని ఎల్పీజీ (ఖా+) సిలిండర్ వినియోగాన్ని ఏకంగా 50 శాతం వరకు తగ్గించుకోవచ్చు. నిత్యం పెరిగే ధరలతో తలపడే కంటే, స్మార్ట్ కుకింగ్ విధానాల ద్వారా సిలిండర్ ఎక్కువ రోజులు వచ్చేలా చేసుకోవడమే ప్రస్తుత పరిస్థితుల్లో సామాన్యుడికి ఉన్న ఏకైక ప్రత్యామ్నాయం.

**గ్యాస్ వినియోగాన్ని సగం తగ్గించే ఆ 10 సూత్రాలు ఇవే**

ప్రెషర్ కుక్కర్ విరివిగా వాడటం: వీలైనంత వరకు వంటకాలకు ప్రెషర్ కుక్కర్ వాడటం వల్ల వంట సమయం 30 నుంచి 70 శాతం వరకు తగ్గుతుంది. ముఖ్యంగా పప్పులు, బీన్స్, మాంసం వండేటప్పుడు ఇది ఇంధనాన్ని బాగా ఆదా చేస్తుంది.

**ముందే నానబెట్టడం:**

పప్పులు, గింజలు, బియ్యాన్ని వండటానికి కనీసం కొంత సమయం ముందే నానబెట్టాలి. రాజ్మా, శనగలు వంటి వాటిని 8--10 గంటలు, పప్పులను 30--60 నిమిషాలు, బియ్యాన్ని 20-30 నిమిషాలు నానబెడితే అవి 30-50 శాతం వేగంగా ఉడికి గ్యాస్ ఆదా అవుతుంది.

**సరైన బర్నర్ ఎంపిక:**

పాత్ర పరిమాణానికి సరిపోయే బర్నర్‌నే వాడాలి. చిన్న గిన్నెను పెద్ద బర్నర్‌పై పెడితే చుట్టూ మంట వృథా అవుతుంది. పెద్ద బర్నర్లను కేవలం భారీ వంటకాలకే పరిమితం చేయాలి.

**పాత్రలపై మూతలు పెట్టడం:**

వండేటప్పుడు పాత్రలపై మూతలు పెట్టడం వల్ల లోపల ఆవిరి పెరిగి వంట వేగంగా అవుతుంది. ఇది ఇంధన వినియోగాన్ని 20-25 శాతం తగ్గిస్తుంది.

కూరగాయలను చిన్న ముక్కలుగా కోయడం: కూరగాయలను చిన్న ముక్కలుగా కోయడం వల్ల వేడి త్వరగా లోపలికి వెళ్తుంది. దీనివల్ల పెద్ద ముక్కల కంటే చిన్న ముక్కలు వేగంగా ఉడుకుతాయి.

మిగిలిన వేడిని ఉపయోగించడం: వంట దాదాపు పూర్తయ్యాక స్టవ్ కట్టేసినా పాత్రలో ఉండే వేడికి ఆహారం ఉడుకుతుంది. అన్నం, కిచిడీ, ఉడికించిన కూరగాయలను 2-3 నిమిషాల ముందే స్టవ్ కట్టేసి ఆ వేడిపైనే మగ్గనివ్వాలి.

**మల్టీ-కుకింగ్:**

ప్రెషర్ కుక్కర్ లోపల కింద పప్పు, పైన గిన్నెలో బియ్యం, దానిపై చిన్న గిన్నెలో కూరగాయలు పెట్టి ఒకే మంటపై మూడు వంటకాలను ఒకేసారి పూర్తి చేయవచ్చు.

బర్నర్ల క్లీనింగ్: స్టవ్ బర్నర్ రంధ్రాలలో మురికి చేరితే మంట సరిగ్గా రాదు. బర్నర్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయడం వల్ల నీలం రంగు మంట వచ్చి వేడి వేగంగా అందుతుంది. పసుపు రంగు మంట వస్తే గ్యాస్ వృథా అవుతున్నట్లు అర్థం.

**మందపాటి, ఫ్లాట్-బాటమ్ పాత్రలు:**

మందపాటి అడుగు భాగం ఉన్న స్టీల్ లేదా కాస్ట్ ఐరన్ పాత్రలు వేడిని సమానంగా పంపిణీ చేస్తాయి. పలుచని పాత్రలు వేడిని వృథా చేయడమే కాకుండా ఆహారాన్ని అడుగున మాడ్చేస్తాయి.

**స్మార్ట్ ప్లానింగ్:**

వంటకు కావాల్సిన కూరగాయల కోత, మసాలాల తయారీ వంటివన్నీ ముందే సిద్ధం చేసుకున్నాకే స్టవ్ వెలిగించాలి. అలాగే 2-3 పూటలకు సరిపడా అన్నం, పప్పును ఒకేసారి వండుకోవడం వల్ల పదే పదే స్టవ్ వెలిగించే పని తప్పుతుంది.

**మూడు నెలల్లో రెండోసారి పెరిగిన ధరలు**

దేశీయ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (OMCs) గృహ వినియోగ ఎల్పీజీ (14.2 KG) సిలిండర్ ధరను మరో రూ. 29 పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. ఈ సవరించిన ధరలు దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. గత మార్చి నెలలో రూ. 60 పెంచిన కంపెనీలు.. కేవలం మూడు నెలల వ్యవధిలోనే రెండోసారి ధరలను పెంచడం గమనార్హం. వరుస పెంపులతో సామాన్యుడి వంటగది బడ్జెట్ తలకిందులవుతోంది. అందుకే, ఈ ధరల సెగ నుంచి తప్పించుకోవడానికి నిపుణులు సూచించిన పై చిట్కాలను పాటించడం ప్రతి ఇంటికీ ఎంతో అవసరం.

# ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం.. కుటుంబంపై యువకుడి కిరాతకం.. ఇద్దరి మృతి

కర్ణాటకలో 18 ఏళ్ల యువకుడు కుటుంబ సభ్యులపై కత్తితో దాడి

ఈ దాడిలో తండ్రి, సోదరి మృతి, తల్లి పరిస్థితి విషమం

నిందితుడు సైతం కత్తితో పొడుచుకుని ఆత్మహత్యాయత్నం

ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనమే ఘటనకు కారణమని పోలీసుల అనుమానం

కొప్పల్ జిల్లాలో జరిగిన ఈ దారుణ ఘటనపై లోతుగా విచారణ

కర్ణాటకలోని కొప్పల్ జిల్లాలో ఒక కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కన్నకొడుకే కాలయముడై తల్లిదండ్రులు, సోదరిపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ కిరాతక ఘటనలో ఇద్దరు మరణించగా, మరొకరు ప్రాణాలతో పోరాడుతున్నారు. ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనమే ఈ దారుణానికి కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం కొప్పల్ జిల్లాకు చెందిన సాయి నాయుడు (18) అనే యువకుడు తన తండ్రి యంకన్న నాయుడు (48), తల్లి సౌజన్య, సోదరి ప్రగతి (20)పై సోమవారం కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ



ఘటనలో తీవ్రంగా గాయపడిన ప్రగతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. తీవ్ర గాయాలపాలైన మిగతా వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే, బళ్లారిలోని బీమ్స్ (బీఐఎంఎస్) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తండ్రి యంకన్న నాయుడు కూడా మరణించారు. తల్లి సౌజన్య పరిస్థితి అత్యంత విషమంగా ఉందని, ఆమెకు ఐసీయూలో చికిత్స కొనసాగుతోందని వైద్యులు తెలిపారు.కుటుంబ సభ్యులపై దాడి చేసిన అనంతరం నిందితుడు సాయి నాయుడు కూడా తనను తాను కత్తితో పొడుచుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం అతడు కూడా అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కొప్పల్ జిల్లా పోలీసులు ఆసుపత్రికి చేరుకుని అతడిని విచారిస్తున్నారు. గంగావతి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో సాయి నాయుడు ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసైనట్లు తేలింది. అయితే, ఈ దాడికి గేమింగ్ వ్యసనమే ప్రత్యక్ష కారణమా? లేక కుటుంబంలో ఇతర గొడవలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఒకవైపు తల్లి ప్రాణాలతో పోరాడుతుండగా, ఈ దారుణ ఘటన వెనుక ఉన్న అసలు కారణాలను నిగ్గుతేల్చే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# టెక్నాలజీ దిశగా అనిల్ అంబానీ కంపెనీ.. ఏఐ రంగంలోకి అడుగు

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలోకి రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రవేశం - ఏఐ సేవల కోసం మూడు అనుబంధ సంస్థల పేర్ల మార్పు**

**రిలయన్స్ ఏఐ వరల్డ్, అపెక్స్, వన్ పేర్లతో కొత్త కంపెనీల ఏర్పాటు - ప్రకటన తర్వాత బీఎస్ఈలో 5 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్ తాకిన షేరు**

**2026 మార్చి త్రైమాసికంలో రూ. 918 కోట్ల నికర లాభం నమోదు**




పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ (ఆర్-ఇన్ఫ్రా) ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇతర నూతన టెక్నాలజీల రంగంలోకి ప్రవేశిస్తున్నట్లు నేడు అధికారికంగా ప్రకటించింది. తన వ్యాపార కార్యకలాపాల్లో టెక్నాలజీ ఆధారిత సేవలను భాగం చేసే వ్యూహంలో భాగంగా ఈ అడుగు వేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ మేరకు తమ అనుబంధ సంస్థల (సబ్సిడరీలు) ద్వారా ఈ కొత్త వ్యాపారంలోకి ప్రవేశిస్తున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన ఫైలింగ్‌లో రిలయన్స్ ఇన్ఫ్రా పేర్కొంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ, సంబంధిత టెక్నాలజీ విభాగాల్లో పాలుపంచుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ఈ ప్రణాళికలో భాగంగా తమ మూడు సబ్సిడరీల పేర్లను కూడా మార్చింది. వాటికి రిలయన్స్ ఏఐ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ ఏఐ అపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ ఏఐ వన్ ప్రైవేట్ లిమిటెడ్ అని కొత్త పేర్లు పెట్టింది. రిలయన్స్ ఇన్ఫ్రా ఏఐ రంగ ప్రవేశ ప్రకటన మార్కెట్లో తక్షణమే సానుకూల ప్రభావం చూపింది. ఈ వార్త వెలువడిన వెంటనే బీఎస్ఈలో కంపెనీ షేరు 5 శాతం పెరిగి రూ.86.17 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. అయితే, గత కొంతకాలంగా ఈ షేరు పనితీరు మిశ్రమంగా ఉంది. గత ఏడాది కాలంలో సుమారు 80 శాతం నష్టపోయినప్పటికీ, గత నెల రోజుల్లో 20 శాతానికి పైగా లాభపడటం గమనార్హం. గత ఆరు నెలల్లో 40 శాతం పతనం కాగా, గత ఐదేళ్లలో మాత్రం 3 శాతానికి పైగా లాభాలను అందించింది. ఇక కంపెనీ ఆర్థిక ఫలితాలను పరిశీలిస్తే, 2026 మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.918కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది.

కార్యకలాపాల ద్వారా రూ. 4,001 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపింది. అలాగే, 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ. 2,900 కోట్ల లాభాన్ని, రూ. 20,440 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. అయితే, ఏఐ రంగంలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, ఈ ప్రాజెక్టులకు ఎంత పెట్టుబడి పెట్టనున్నారు, నిర్దిష్ట వ్యాపార ప్రణాళికలు ఏమిటి, ఎప్పటిలోగా కార్యకలాపాలు ప్రారంభిస్తారు? వంటి కీలక వివరాలను కంపెనీ ప్రస్తుతానికి వెల్లడించలేదు. ఈ అంశాలపై భవిష్యత్తులో స్పష్టత వచ్చే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

# భారత్-నేపాల్ సరిహద్దులో తృణమూల్ 'పుష్పరాజ్' జహంగీర్ ఖాన్ అరెస్ట్!

**మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి అత్యంత ఆప్తుడు జహంగీర్ ఖాన్ - ఎన్నికల ఫలితాల తర్వాత ఐదు కొత్త కేసులు నమోదు**

**భారత్-నేపాల్ సరిహద్దుల్లో అరెస్ట్ చేసిన స్పెషల్ టాస్క్ ఫోర్స్**



పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ సుదీర్ఘ పాలనకు తెరపడి, కొత్త ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులకే ఒక సంచలన అరెస్ట్ నమోదైంది. పశ్చిమ బెంగాల్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ జరిపిన మెరుపు దాడిలో తృణమూల్ కాంగ్రెస్ కీలక నేత, మాజీ అభ్యర్థి జహంగీర్‌ఖాన్ భారత్-నేపాల్ సరిహద్దుల్లో అరెస్టయ్యారు. కలకత్తా హైకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ లేదా రక్షణ పొడిగించేందుకు నిరాకరించడంతో ఎస్టీఎఫ్ ఈ చర్య తీసుకుంది. మే 4న ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఆయనపై ఐదు కొత్త పోలీస్ కేసులు నమోదయ్యాయని కోర్టు ఈ సందర్భంగా గుర్తుచేసింది. మమతా బెనర్జీ మేనల్లుడు, డైమండ్ హార్బర్ ఎంపీ అభిషేక్ బెనర్జీకి జహంగీర్ ఖాన్ అత్యంత ఆప్తుడు. డైమండ్ హార్బర్ పరిధిలోని ఫాల్తా నియోజకవర్గంలో జహంగీర్ ఖాన్ వర్గీయులు భయాందోళనలు సృష్టిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో యూపీ కేడర్‌కు చెందిన 'ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్' ఐపీఎస్ అధికారి అజయ్ పాల్ శర్మ (సింగం ఇమేజ్ ఉన్న ఆఫీసర్) అక్కడ స్పెషల్ అబ్జర్వర్‌గా నియమితులయ్యారు. ఫాల్తా ప్రాంతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారికి శర్మ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. దీనికి కౌంటర్‌గా జహంగీర్ ఖాన్... టాలీవుడ్ హిట్ సినిమా 'పుష్ప' డైలాగులను వాడుతూ, తానే ఇక్కడి 'పుష్పరాజ్'నని, తగ్గేదేలేదంటూ సవాల్ విసిరారు. ఎన్నికల అవకతవకలు, బెదిరింపుల ఆరోపణలతో అప్పటినుంచే ఆయన పోలీసుల రాడార్‌లో ఉన్నారు.

**ఫాల్తా ఉపఎన్నిక ట్విస్ట్:**

ఏప్రిల్ 29న ఫాల్తా నియోజకవర్గంలో పోలింగ్ జరిగింది. అయితే ఈవీఎంలలో బీజేపీ బటన్‌పై టేప్ అంటించారనే ఆరోపణలు రావడంతో ఎన్నికల సంఘం మే 21న రీపోలింగ్‌కు ఆదేశించింది. ఈలోపే మే 4న రాష్ట్ర ఫలితాలు వచ్చేసి సువేందు అధికారి నేతృత్వంలో బీజేపీ బెంగాల్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మే 19న ఊహించని ట్విస్ట్ ఇస్తూ... ఫాల్తా అభివృద్ధి కోసమే పోటీ నుంచి తాను తప్పుకుంటున్నానని జహంగీర్ ప్రకటించారు. చివరకు ఫాల్తా స్థానంలో బీజేపీ అభ్యర్థి దేబాంగ్షు పాండా లక్షకు పైగా ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించగా, పోటీ నుంచి తప్పుకున్న జహంగీర్ ఖాన్‌కు కేవలం 8,000 లోపు ఓట్లు మాత్రమే వచ్చి నాల్గవ స్థానంలో నిలిచారు. ఆయన పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించినా, ఈవీఎంలలో ఆయన పేరు ఉండిపోయింది. ఇక, ఎన్నికల తర్వాత అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లిపోయి సరిహద్దులు దాటాలని చూసిన ఈ తృణమూల్ 'పుష్ప'ను ఎట్టకేలకు బెంగాల్ పోలీసులు కటకటాల్లోకి నెట్టారు.

# ఇరాన్‌కు వెళ్లొద్దు.. ఆ దేశంలో ఉన్నవారు వెంటనే వచ్చేయండి: భారతీయులకు కేంద్రం సూచన

**ఇరాన్‌కు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని భారతీయులకు సూచన - ఇరాన్‌లో ఉన్నవారు వెంటనే దేశం విడిచి రావాలని విజ్ఞప్తి**

**ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలే కారణం - ఇరాన్‌పై ఇజ్రాయెల్.. ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడుల నేపథ్యంలో నిర్ణయం**

**పశ్చిమాసియాలో తాజా పరిణామాలతో భారత ప్రభుత్వం అప్రమత్తం**



పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరడంతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు ప్రయాణాలు మానుకోవాలని, ఇప్పటికే అక్కడ ఉన్నవారు వెంటనే దేశం విడిచి వచ్చేయాలని తన పౌరులకు నేడు మరోసారి సూచించింది. ఈ మేరకు టెహరాన్‌లోని భారత రాయబార కార్యాలయం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. "ఈ ప్రాంతంలోని తాజా పరిణామాల దృష్ట్యా ఇరాన్‌కు ఎలాంటి ప్రయాణాలు చేయవద్దని మా పాత సలహాను పునరుద్ఘాటిస్తున్నాం. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు కూడా అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా దేశం విడిచి వెళ్లాలని సూచిస్తున్నాం" అని ఎంబసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఇటీవల ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య దాడులు, ప్రతిదాడులు పెరిగాయి. ఇరాన్‌లోని మహ్‌షహర్ ప్రాంతంలో ఉన్న పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌పై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ప్రకటించింది. మరోవైపు, సోమవారం ఉదయం ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రయోగించిన క్షిపణులన్నింటినీ విజయవంతంగా అడ్డుకున్నామని ఐడీఎఫ్ తెలిపింది. ఈ దాడుల నేపథ్యంలోనే భారత్ ఈ ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది. ఇజ్రాయెల్ గనక దక్షిణ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, ఇజ్రాయెల్, దాని మద్దతుదారులపై వినాశకరమైన దాడులు తప్పవని ఇరాన్ కమాండర్ అలీ అబ్దుల్లాహీ హెచ్చరించారు. అమెరికా పచ్చజెండా ఊపడంతోనే ఇజ్రాయెల్ ఫాస్పరస్ బాంబుల వంటి నిషేధిత ఆయుధాలను వాడుతూ యుద్ధ నేరాలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు.

ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖొమైనీ, ఇతర సైనిక ఉన్నతాధికారులు మరణించడంతో ఈ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. దీనికి ప్రతీకారంగా ఇరాన్ పలుచోట్ల డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేసింది. ఏప్రిల్ 8న కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటికీ, ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే, శాంతి స్థాపన కోసం ఇరాన్, అమెరికా మధ్య చర్చలు జరుగుతున్నట్లు కూడా నివేదికలు వస్తున్నాయి.



# అన్నం, రొట్టె కలిపి తినొద్దు..

## ఆరోగ్యానికి ముప్పేనంటున్న నిపుణులు!

**ఒకే భోజనంలో అన్నం, రొట్టె తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం**

**భారత్‌లో డయాబెటిస్, ఊబకాయం పెరగడానికి ఇదొక కారణం**

**ఆహారంలో ప్రోటీన్లు, కూరగాయలు తగ్గి కార్బోహైడ్రేట్లు పెరగడమే అసలు సమస్య**

**ప్లేటులో సగం కూరగాయలు, పావు వంతు ప్రోటీన్ ఉండేలా చూసుకోవాలని సూచన**

**కార్బోహైడ్రేట్లను పావు వంతుకు పరిమితం చేయాలని నిపుణుల సలహా**

భారతీయులు చాలా మంది ఒకే భోజనంలో అన్నం, రొట్టె రెండూ తినడానికి ఇష్టపడతారు. అయితే, ఈ అలవాటే దేశంలో పెరుగుతున్న డయాబెటిస్, ఊబకాయం, గుండె జబ్బులకు ఒక ప్రధాన కారణంగా మారుతోందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అన్నం లేదా రొట్టె ఆరోగ్యానికి హానికరం కాకపోయినా, రెండింటినీ ఒకేసారి అధిక మొత్తంలో తీసుకోవడమే అసలు సమస్యకు మూలమని వారు స్పష్టం చేస్తున్నారు. గతంలో ఉత్తరాదిలో రొట్టె, దక్షిణాదిలో అన్నం ప్రధాన ఆహారంగా ఉండేది. పట్టణీకరణ పెరిగాక, ఈ రెండు ఆహారాలు ఒకే ప్లేటులోకి చేరాయి. దీనివల్ల భోజనంలో కార్బోహైడ్రేట్ల వాటా విపరీతంగా పెరిగి, ప్రోటీన్లు, కూరగాయలు, పీచుపదార్థాల వాటా తగ్గిపోతోంది. ఇలా అధిక కార్బోహైడ్రేట్లు తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరిగి, ఇన్సులిన్ నిరోధకతకు దారితీస్తుంది. ఇది క్రమంగా మధుమేహం, ఊబకాయం వంటి సమస్యలకు కారణమవుతుంది.

**ఆరోగ్యకరమైన భోజనం ఎలా?**

ఆరోగ్యంగా ఉండాలంటే భోజనాన్ని సమతులంగా మార్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వారి సలహా ప్రకారం... మీ భోజనం ప్లేటులో సగం భాగం కూరగాయలు, సలాడ్లతో నింపాలి. మరో పావు వంతులో పప్పు, పనీర్, గుడ్లు, చికెన్ వంటి ప్రోటీన్లు ఉండేలా చూసుకోవాలి. మిగిలిన పావు వంతులో మాత్రమే అన్నం లేదా రొట్టె వంటి కార్బోహైడ్రేట్లను తీసుకోవాలి. ఆహారాన్ని పూర్తిగా మానేయడం కంటే, పరిమాణంపై దృష్టి పెట్టడం, ప్లేటును సమతులంగా మార్చుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలను దూరంగా ఉంచుకోవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# రంగనాయక స్వామివారి భక్తుల సమస్యలపై వినతి

గిద్దలూరు, సింధూరదర్శిని: రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.రమేష్ నాయుడు ప్రకాశం జిల్లా సెగ్గం శ్రీనివాసరావు శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి వారిని దర్శించి స్వామి వారి ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. రాష్ట్ర కిసాన్ మోర్చా మాజీ కార్యవర్గ సభ్యులు పిడతల రమేష్ రెడ్డి రంగనాయక స్వామివారి భక్తుల సమస్యల పైన వినతి పత్రం ఇవ్వడం జరిగినది. ప్రభుత్వం వారు మంజూరు చేసిన ఆరు కోట్లు ఇక్కడి భక్తులకు అనుగుణంగా వసతి సౌకర్యాలు షాపింగ్ క్యాంపస్ టాయిలెట్స్ మహిళలకు పురుషులకు ప్రత్యేక టాయిలెట్స్ ఏర్పాటు చేపించవలసినదిగా వినతి పత్రం ఇవ్వడం జరిగినది.

కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి భక్తులకి ఇబ్బందులు లేకుండా వసతి సౌకర్యాలు కల్పించాలని పివిఎన్ మాధవ్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగినది ఆయన కూడా సానుకూలంగా ఇక్కడికి వచ్చే భక్తులకు చాలా ఇబ్బందులు ఉన్నాయి ఏర్పాటు చేయవలసినదిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో నెమలిగుండ్ల రంగనాయకస్వామి చైర్మన్ సిద్ధం నరసింహులు, రాష్ట్ర కిసాన్ మోర్చా మాజీ కార్యవర్గ సభ్యుడు పిడతల రమేష్ రెడ్డి, నెమలిగుండ్ల రంగనాయక స్వామి కమిటీ మెంబర్ కొప్పుల నరసింహులు, గిద్దలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దూదేకుల బాదుల్లా, గిద్దలూరు టౌన్ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ శంకర్, రాచర్ల మండల కన్వీనర్ మహేష్, సుబ్బరాయుడు రాష్ట్ర, జిల్లా నాయకులు, నియో జకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# కాటూరి సేవలు అభినందనీయం

కర్లపాలెం, సింధూరదర్శిని: ఆధ్యాత్మికత, సేవా కార్యక్రమాలే పరమావధిగా రామకృష్ణ సేవా సమితులు పనిచేస్తాయనీ శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు తిమ్మరాజు వెంకట సుబ్బారావు అన్నారు. కర్లపాలెం శ్రీ రామకృష్ణ సేవా సమితిలో జరిగిన వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరరావు సంస్కరణసభ నిర్వహించారు. కాటూరు వెంకటేశ్వర రావు చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి వనీచ్చలా నంద మహారాజ్, బాపట్ల సమితి కార్యదర్శి, వెంకటేశ్వర్లు, జిడుగు వెంకటేశ్వర్లు, తోట వెంకటేశ్వరరావు, పెనుమత్స బాపిరాజు,తూనుగుంట్ల వెంకట సుబ్బారావు, తూనుగుంట్ల రామ్మోహన్ రావు, తవ్వ సత్యవతి, లలిత, బుల్లయ్య, రమణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ముంబై ఇండియన్స్‌కు సూర్య గుడ్ బై?.. సోషల్ మీడియాలో కలకలం!

టీ20 కెప్టెన్సీ కోల్పోయి, జట్టులో చోటు కోల్పోయిన సూర్యకుమార్ - ముంబై ఇండియన్స్‌ను వీడనున్నట్టు ఊహాగానాలు

ఇన్‌స్టాగ్రామ్‌లో ముంబైకి సంబంధించిన పోస్టులు, ఫొటోల తొలగింపు

సూర్యకు అండగా నిలిచిన భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ - కెప్టెన్‌గా వరల్డ్ కప్ గెలిపించాడన్న విషయం మరువొద్దన్న అశ్విన్

టీమిండియా స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ కెరీర్ ప్రస్తుతం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. ఇటీవలే టీ20 జట్టు కెప్టెన్సీని కోల్పోయి, జట్టులోనూ స్థానం కోల్పోయిన ఆయనకు ఇప్పుడు మరో కొత్త సవాలు ఎదురైంది. తాను ఎంతో కాలంగా ప్రాతినిధ్యం వహిస్తున్న ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీకి కూడా ఆయన గుడ్ బై చెప్పనున్నారనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. తాజాగా సూర్యకుమార్ తన ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్ నుంచి ముంబై ఇండియన్స్‌కు సంబంధించిన అన్ని పోస్టులను, ఫొటోలను తొలగించడం ఈ వాదనలకు బలం చేకూర్చింది. 2018లో కోల్‌కతా నైట్ రైడర్స్ నుంచి ముంబై ఇండియన్స్‌కు వచ్చిన సూర్యకుమార్, జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. అయితే, 2026 ఐపీఎల్ సీజన్‌లో ఆయన దారుణంగా విఫలమయ్యాడు. ఈ సీజన్‌లో 10 మ్యాచ్‌లలో కేవలం 20.77 సగటుతో 270 పరుగులు మాత్రమే చేశాడు. దీంతో ముంబై యాజమాన్యం ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నట్టు తెలుస్తోంది. సూర్యకుమార్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ముంబై



ఇండియన్స్, హార్దిక్ పాండ్యా ఖాతాలను అనుసరించడం లేదని కూడా ఫ్యాన్స్ గుర్తించారు. ప్రస్తుతం రోహిత్ శర్మ, ఎంఎస్ ధోనీతో ఉన్న ఒక ఫొటో మాత్రమే సూర్య ఖాతాలో ఉంది.

**సూర్యకుమార్‌కు అన్యాయం జరిగింది: అశ్విన్**

ఈ పరిణామాలపై టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ స్పందించాడు. సూర్యకుమార్‌ను జట్టు నుంచి తప్పించడంపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. "సూర్యకుమార్ స్థానంలో ఉండి ఆలోచిస్తే, అతని బాధను అర్థం చేసుకోవచ్చు. జట్టు నుంచి తొలగించినందుకు బాధపడే హక్కు ప్రతి ఆటగాడికీ ఉంటుంది" అని అశ్విన్ పేర్కొన్నాడు.

"గత 15-18 నెలలుగా సూర్య ఫామ్‌లో లేడన్న మాట వాస్తవమే కావచ్చు. కానీ, ఒక కెప్టెన్‌గా అతను దేశానికి టీ20 ప్రపంచకప్ అందించాడన్న విషయాన్ని సెలక్టర్లు విస్మరించారు. వరల్డ్ కప్‌లో బ్యాటర్‌గా గొప్పగా రాణించకపోయినా, కెప్టెన్‌గా జట్టును విజయపథంలో నడిపించాడు. జట్టులోని ఉత్తమ బ్యాటర్, బౌలర్ మాదిరిగానే, అతను కూడా ఉత్తమ కెప్టెన్‌గా తన పాత్ర పోషించాడు కదా?" అని అశ్విన్ ప్రశ్నించాడు. మొత్తం మీద టీమిండియాలో చోటు కోల్పోవడం, ఇప్పుడు ఫ్రాంచైజీ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకోవడంతో సూర్యకుమార్ కెరీర్ ఒకరకమైన సందిగ్ధ దశలో పడింది.

# రాత్రి 9 గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ: సజ్జనార్ కీలక సూచనలు

చేప ప్రసాదం పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసినట్టు సజ్జనార్ వెల్లడి

వివిధ రాష్ట్రాల నుంచి ఇప్పటికే 25 వేల మంది నగరానికి చేరుకున్నారన్న సీపీ

అందరికీ సరిపడా ప్రసాదం అందుబాటులో ఉందని స్పష్టీకరణ

హైదరాబాద్, సింధూరదర్శిని: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 'చేప ప్రసాదం' పంపిణీ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేసినట్లు సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఈ రోజు రాత్రి 9 గంటల నుంచే ఈ పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇప్పటికే మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్‌లు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను



పరిశీలించారని... దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 25 వేల మంది ఇప్పటికే నగరానికి చేరుకున్నారని ఆయన తెలిపారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెయ్యి మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశామని... ఈ భద్రతా చర్యలను గోల్కొండ డీసీపీ చంద్రమోహన్ పర్యవేక్షిస్తారని వెల్లడించారు. నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని, అత్యవసర వైద్య సేవల కోసం ఐదు అంబులెన్సులను సిద్ధంగా ఉంచామని చెప్పారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా వివిధ భాషల్లో భక్తులకు సూచనలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అందరికీ సరిపడా ప్రసాదం అందుబాటులో ఉందని, ఎలాంటి పుకార్లను నమ్మవద్దని సీపీ స్పష్టం చేశారు.

స్థానికులు రద్దీని బట్టి రేపైనా వచ్చి ప్రసాదం తీసుకోవచ్చని సూచించారు. షీ టీమ్స్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిరంతరం నిఘా ఉంచుతారని చెప్పారు. చేప ప్రసాదం కోసం వచ్చిన వాళ్లు రాత్రి వేళల్లో పోలీసులకు సహకరించాలని కోరారు.

# పెళ్లికి ముందు లైంగిక సంబంధాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన గాజుల తిరుపతి కేసులో సుప్రీం తీర్పు

పెళ్లికి ముందు మేజర్లు ఇష్టపూర్వకంగా సంబంధం పెట్టుకుంటే తప్పుకాదన్న కోర్టు

మారుతున్న కాలంలో ఇది సాధారణమైందన్న అత్యున్నత న్యాయస్థానం

దీని ఆధారంగా క్యారెక్టర్‌ను తప్పుబట్టలేమన్న కోర్టు - ఉద్యోగంలోకి తీసుకోవాలని ఆదేశం

అమరావతి, సింధూరదర్శిని: ఇద్దరు మేజర్లు ఇష్టపూర్వకంగా పెళ్లికి ముందే శారీరక సంబంధం పెట్టుకుంటే.. దాని ఆధారంగా వారి ప్రవర్తన లేదా క్యారెక్టర్‌ను తప్పుబట్టలేమని సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. పరస్పర అంగీకారంతో సాగిన ఇలాంటి సంబంధాలను చట్టం ఏమాత్రం నిషేధించలేదని స్పష్టం చేసింది. తెలంగాణకు చెందిన గాజుల తిరుపతి అనే అభ్యర్థి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అయితే పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ 2014లో అతనిపై ఓ యువతి క్రిమినల్ కేసు పెట్టింది. ఆ తర్వాత 2015లో లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాలు రాజీకొచ్చాయి. ఈ పాత కేసును కారణం చూపిస్తూ తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ అతని ఉద్యోగాన్ని రద్దు చేసింది. దీనిపై సదరు అభ్యర్థి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ కేసును విచారించిన జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం.. పోలీసు బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని



తప్పుబట్టింది. మారుతున్న సామాజిక పరిస్థితుల్లో పెళ్లికి ముందే ప్రేమించుకోవడం, శారీరక సంబంధాలు కలిగి ఉండటం సాధారణంగా మారిందని కోర్టు వ్యాఖ్యానించింది. ఇష్టపూర్వకంగా కలిసి ఉన్నంత మాత్రాన, ఆ తర్వాత వారు పెళ్లి చేసుకోలేదనే ఒకే ఒక్క కారణంతో ఒకరు మరొకరిని మోసం చేశారని అనుకోలేమని స్పష్టం చేసింది. ప్రతి ప్రేమకథా పెళ్లితోనే ముగియాలని నియమం ఏమీ లేదని ధర్మాసనం పేర్కొంది. లోక్ అదాలత్‌లో కేసు రాజీపడినంత మాత్రాన అభ్యర్థి తన తప్పును ఒప్పుకొన్నట్లు కాదని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. బాధితురాలే స్వయంగా కేసును వెనక్కి తీసుకుని రాజీపడినప్పుడు.. సదరు అభ్యర్థి క్యారెక్టర్ బాలేదంటూ ఉద్యోగానికి అనర్హుడిని చేయడానికి పోలీస్ బోర్డుకు ఎలాంటి హక్కు లేదని తేల్చిచెప్పింది. కేవలం విఫలమైన ప్రేమ బంధాన్ని సాకుగా చూపి ఉద్యోగం నిరాకరించడం పూర్తిగా అన్యాయమని కోర్టు పేర్కొంది. చివరికి సుప్రీంకోర్టు తెలంగాణ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇచ్చిన రద్దు ఉత్తర్వులను పూర్తిగా కొట్టివేసింది. సదరు అభ్యర్థిని వెంటనే విధుల్లోకి తీసుకుని, తదుపరి బ్యాచ్ కానిస్టేబుళ్లతో పాటు శిక్షణకు పంపాలని ఆదేశిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పునరుద్ధరించింది.

# భారీ నష్టాల్లో సూచీలు.. 700 పాయింట్లకు పైగా పతనమైన సెన్సెక్స్

పశ్చిమ ఆసియాలో నెలకొన్న తాజా ఉద్రిక్తతలు భారత స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. సోమవారం ట్రేడింగ్‌లో దేశీయ సూచీలు భారీ నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వెలువడిన ప్రతికూల సంకేతాలకు తోడు ముడిచమురు ధరలు పెరగడంతో మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. ఫలితంగా, బీఎస్ఈ సెన్సెక్స్ 719.08 పాయింట్లు పతనమై 73,524.26 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 243.70 పాయింట్లు క్షీణించి 23,123 వద్ద స్థిరపడింది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి దాడులకు దిగడం, దానికి ప్రతిగా ఇజ్రాయెల్ సైతం వైమానిక దాడులతో విరుచుకుపడటంతో పశ్చిమ ఆసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ పరిణామాల వల్ల అంతర్జాతీయంగా ముడిచమురు సరఫరాకు ఆటంకం



కలుగుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధరలు పెరగడం, భారత్ వంటి ముడిచమురు దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే దేశాలలో ద్రవ్యోల్బణం భయాలను పెంచుతోంది. మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి అన్ని రంగాల్లోనూ ప్రస్ఫుటంగా కనిపించింది. ప్రధానంగా రియల్టీ, మెటల్, ఆటో రంగాల షేర్లు భారీగా నష్టపోయాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం 1.66 శాతం నుంచి 2.88 శాతం వరకు పతనమయ్యాయి. మరోవైపు, ఇరాన్‌కు ప్రయాణాలను నిలిపివేయాలని, అక్కడ ఉన్న భారతీయులు తక్షణమే స్వదేశానికి తిరిగి రావాలని కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అంతర్జాతీయంగా నెలకొన్న ఈ అనిశ్చితి కారణంగా మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# జై షా - పాకిస్థాన్ కెప్టెన్ కరచాలనం..

సోషల్ మీడియాలో హీటెక్కిన చర్చ!

ఈ నెల 12న ప్రారంభమవుతున్న టీ20 మహిళల వరల్డ్ కప్

నిన్న జరిగిన కార్యక్రమంలో పాక్ కెప్టెన్ ఫాతిమాతో జై షా కరచాలనం

భారత్ నో హ్యాండ్‌షేక్ పాలసీని గుర్తు చేస్తున్న పాక్ అభిమానులు

2026 ఐసీసీ మహిళల టీ20 వరల్డ్ కప్ ప్రారంభానికి ముందే ఒక చిన్న కరచాలనం సోషల్ మీడియాలో పెద్ద దుమారం రేపుతోంది. ఇంగ్లండ్‌లో నిన్న (జూన్ 7) జరిగిన 'కెప్టెన్స్ కార్నివాల్' ఈవెంట్‌లో ఐసీసీ ఛైర్మన్ జై షా, పాకిస్థాన్ మహిళా జట్టు కెప్టెన్ ఫాతిమా సనాతో కరచాలనం చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు వైరల్ కావడంతో భారత్, పాకిస్థాన్ అభిమానుల మధ్య పెద్ద ఎత్తున చర్చ మొదలైంది.

**క్రీడా స్ఫూర్తా దౌత్య నీతా**

జై షా చేసిన ఈ పనిని కొందరు క్రీడా స్ఫూర్తికి నిదర్శనంగా అభివర్ణిస్తుంటే, మరికొందరు మాత్రం విమర్శిస్తున్నారు. ముఖ్యంగా గతంలో ద్వైపాక్షిక సిరీస్‌ల సమయంలో భారత్ అనుసరించిన 'నో హ్యాండ్‌షేక్' పాలసీని పాక్ అభిమానులు గుర్తుచేస్తున్నారు. అయితే భారత అభిమానులు మాత్రం జై షాను వెనకేసుకొస్తున్నారు. ఆయన ఐసీసీ ఛైర్మన్ హోదాలో ఉన్నారని, ఆ పదవిలో ఉన్నప్పుడు అన్ని దేశాలను సమానంగా చూడటం, సభ్య దేశాల ప్రతినిధులతో దౌత్యపరమైన సంబంధాలు కొనసాగించడం ఆయన కనీస బాధ్యత అని స్పష్టం చేస్తున్నారు. పుల్వామా ఉగ్రదాడి తర్వాత అధికారిక కార్యక్రమాల్లో కూడా భారత ఆటగాళ్లు పాక్ ఆటగాళ్లకు దూరంగా ఉండేవారు. ఇప్పుడు జై షా తీరు ఆ పాత జ్ఞాపకాలను మళ్లీ తెరపైకి తెచ్చింది.

**ఇక టోర్నమెంట్ విషయానికి వస్తే..**

జూన్ 12: ఇంగ్లండ్ వర్సెస్ శ్రీలంక మ్యాచ్‌తో వరల్డ్ కప్ ప్రారంభం కానుంది.

జూన్ 14: క్రికెట్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్ వర్సెస్ పాకిస్థాన్ పోరు బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో జరగనుంది.


డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఉన్న న్యూజిలాండ్ ఈసారి కూడా తన టైటిల్‌ను కాపాడుకునేందుకు ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

# వైభవ్ సూర్యవంశీది స్పెషల్ టాలెంట్.. కానీ..!: కపిల్ దేవ్

వైభవ్‌పై కపిల్ ప్రశంసల జల్లు - అతడిపై ఒత్తిడి తేవొద్దని సూచన

కేవలం ఆటపైనే ఫోకస్ చేయాలని వైభవ్‌కు సూచన

ఐపీఎల్ వల్ల సెలెక్టర్లకు మంచి ఆప్షన్లు దొరుకుతున్నాయని విశ్లేషణ



భారత క్రికెట్ జట్టు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ ప్రశంసలు కురిపించాడు. అతడు చాలా అద్భుతమైన ప్రతిభావంతుడని కొనియాడాడు. అయితే ఇంత చిన్న వయసులోనే అతనిపై విపరీతమైన ఒత్తిడిని తీసుకురావద్దని సూచించాడు. వైభవ్ ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉందని, చిన్న వయసులోనే క్లబ్ క్రికెట్‌లో అతను ఆడిన తీరు అతని అసాధారణ సామర్థ్యాన్ని నిరూపించిందని కపిల్ దేవ్ అన్నాడు. ప్రస్తుతం అతను ఎక్స్‌ట్రా విషయాల జోలికి వెళ్లకుండా కేవలం తన ఆటపై మాత్రమే దృష్టి పెట్టాలని సూచించాడు. ఈ సమయంలో అతనిపై మనమందరం మోయలేనంత ఒత్తిడి పెంచుతున్నామని ఆందోళన వ్యక్తం చేశాడు. సెలెక్షన్ ప్రక్రియపై ఐపీఎల్ ప్రభావం గురించి 1983 ప్రపంచకప్ విజేత కపిల్ దేవ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచంలోనే ఐపీఎల్ అత్యంత కీలకమైన టోర్నమెంట్ అని పేర్కొన్నాడు. ఐపీఎల్‌లో ఆటగాళ్ల ప్రదర్శనను సెలెక్టర్లు నిరంతరం గమనిస్తున్నారని, సరైన స్థానంలో సరిపోయే ఆటగాళ్లను ఎంపిక చేయడానికి సెలెక్టర్లకు ఇప్పుడు మంచి ఆప్షన్లు దొరుకుతున్నాయని చెప్పాడు. ఇక వైభవ్ సూర్యవంశీ విషయానికి వస్తే.. కేవలం 15 ఏళ్ల 71 రోజుల వయసులోనే ఈ ఎడమచేతి వాటం ఓపెనర్ భారత టీ20 జట్టుకు ఎంపికయ్యాడు. రాబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలతో పాటు ఆసియా క్రీడలు 2026 కోసం సెలెక్టర్లు అతనికి చోటు కల్పించారు. దీంతో భారత జట్టుకు ఎంపికైన అత్యంత పిన్న వయస్కుడిగా నిలిచి సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 36 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టాడు.

## విజయకృష్ణ థియేటర్‌లో అధికారుల తనిఖీ

బాపట్ల:బాపట్లలోని విజయకృష్ణ థియేటర్‌లో ఆదివారం జరిగిన ఘటన నేపథ్యంలో సోమవారం రెవెన్యూ, సివిల్ సప్లైస్, విద్యుత్, అగ్నిమాపక శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. తహసీల్దార్ సలీమా, సివిల్ సప్లైస్ డీటీ ఫణికుమార్, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు, అగ్నిమాపక అధికారి రామసిద్ధార్థ థియేటర్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, అనుమతులకు సంబంధించిన పత్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సలీమా మాట్లాడుతూ, థియేటర్‌లో అధిక ధరలకు వస్తువుల విక్రయం, ప్రేక్షకుల పట్ల అసభ్య ప్రవర్తన వంటి అంశాలపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. థియేటర్ ప్రాంగణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, శానిటేషన్ వ్యవస్థను మెరుగుపరచాలని సూచించారు.

# సినిమా న్యూస్

## ‘పేట్రియాట్’ (జీ 5) మూవీ రివ్యూ!



మలయాళంలో రూపొందిన సైంటిఫిక్ యాక్షన్ థ్రిల్లర్ ‘పేట్రియాట్’. ఆంటోనీ జోసెఫ్ నిర్మించిన ఈ సినిమాకి, మహేశ్ నారాయణన్ దర్శకత్వం వహించాడు. మమ్ముట్టి .. మోహన్ లాల్ .. ఫహద్ ఫాజిల్ .. కుంచాకో బోబన్ .. నయనతార ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా,మే 1వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఈ నెల 5వ తేదీ నుంచి ఈ సినిమా ‘జీ 5’లో స్ట్రీమింగ్ అవుతోంది. మలయాళంతో పాటు, తెలుగు .. తమిళ .. కన్నడ .. హిందీ భాషల్లో అందుబాటులో ఉంది.

డేనియల్ జేమ్స్ (మమ్ముట్టి) DRW అనే డిఫెన్స్ సంస్థలో సైంటిస్ట్ గా పనిచేస్తుంటాడు. స్మార్టు ఫోన్లు .. ల్యాప్ టాప్ లు వాటి పనితీరుపై ఆయనకి మంచి అవగాహన ఉంటుంది. వాటిలో ఇన్ స్టాల్ చేసే కొన్ని యాప్స్ కారణంగా, అవి ఇతరుల సమాచారాన్ని ఎలా బయటపెడతాయనేది ఆయనకి బాగా తెలుసు. అలాంటి ఒక సమస్యను పరిష్కరించడం కోసం అతణ్ణి ఎంచుకుంటుంది మినిష్టర్ నళిని రామకృష్ణన్ (రేవతి). అయితే ఆ వెంటనే ఆమె చనిపోవడం డేనియల్‌కి అనుమానాన్ని కలిగిస్తుంది.

ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పిల్లలకి ఫ్రీగా ల్యాప్ టాప్ లు అందజేస్తారు.ఆ ల్యాప్ టాప్ లు మినిష్టర్ సుందరానికి సంబంధించిన శక్తి గ్రూప్ తయారు చేస్తుంది. ఆ ల్యాప్ టాప్ లలో రహస్యంగా అమర్చిన కెమెరాలు అవి ఉపయోగించేవారి సమాచారాన్ని బయటికి పంపుతూ ఉంటాయి. ఈ నెట్ వర్క్ వెనుక ఎవరున్నారదనేది కనిపెట్టడానికి డేనియల్ రంగంలోకి దిగుతాడు.

అయితే అప్పటికే అందుకు సంబంధించిన ఆధారాలు జ్యోతి (దర్శన రాజేంద్రన్) చేతికి చిక్కుతాయి. శక్తి గ్రూప్‌కి చెందిన శక్తి సుందరం ఆమెను చంపడానికి ప్లాన్ చేస్తాడు. శక్తి దగ్గర పనిచేసే మైకేల్ (కుంచాకో బోబన్), జ్యోతితో సహజీవనం చేస్తుంటాడు. అతను జ్యోతిని తప్పించడానికి ప్రయత్నిస్తూ ఉంటాడు. శక్తి గ్రూప్ ను చట్టానికి పట్టించాలనుకున్న డేనియల్ కి ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? అతని భార్య లతిక ( నయనతార) అతనికి ఎందుకు దూరంగా ఉంటోంది? డేనియల్ కి సహకరించే రహీమ్ సాహెబ్ (మోహన్ లాల్) ఎవరు? అనేది మిగతా కథ.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అన్ని వైపుల నుంచి విజృంభిస్తోంది. స్మార్టు ఫోన్లు .. ల్యాప్ టాప్ ల వినియోగం చాలామందికి తప్పనిసరి అయిపోయింది. అందువల్లనే వాటి ఆధారంగానే కొంతమంది తమకి కావలసిన కంటెంట్ ను రహస్యంగా రాబట్టేస్తున్నారు. సంబంధిత వ్యక్తికి తెలియకుండానే అతనికి సంబంధించిన వీడియోలు సైతం వెళ్లిపోతున్నాయి. ఇలాంటి వాటిని ఎలా నియంత్రించవలసి ఉంటుందనే అంశం చుట్టూ అల్లుకోబడిన కథ ఇది.

ఇతరుల ముందు మాత్రమేకాదు, ల్యాప్ టాప్ ముందు కూడా బట్టలు మార్చుకోకూడదని నాకు తెలియదు అనే డైలాగ్, ఆఫర్ ఉందని చెప్పి పాత ఫోన్లు ఇచ్చేసి కొత్త ఫోన్లు కొంటే, మన జీవితంలోని అనేక విషయాలు పాత ఫోన్ల ద్వారా బయటికి వెళ్లిపోవడం ఖాయమనే డైలాగ్ .. నేటి ఆధునిక ప్రపంచంలో అందరూ ఎంత జాగ్రత్తగా మసలుకోవాలనేది చెబుతాయి. ఎక్కడో ఉంటూ సీక్రెట్ గా మనలను వాచ్ చేస్తున్నవారికి తగిన గుణపాఠం చెప్పడానికి రంగంలోకి దిగిన ఒక యోధుడి కథగా ఇది కనిపిస్తుంది.

మిగతా అన్ని సినిమాల మాదిరిగానే ఫస్టాఫ్ లో సమస్య .. సెకండాఫ్ లో పరిష్కారం ప్రేక్షకుల ముందుకు వస్తాయి. అయితే ఫస్టాఫ్ లో అసలు సమస్య ఏమిటనేది ప్రేక్షకులకు అర్థం కావడానికి కొంత సమయం పడుతుంది. ఇక ఆ సమస్యకి కారకులు ఎవరనే విషయాన్ని కనుక్కోవడానికి హీరో చేసే ప్రయత్నం అంత ఇంట్రెస్టింగ్‌గా ఏమీ ఉండదు. అతనిపై దేశ ద్రోహిగా ముద్ర వేయడం.. అతను విదేశాలకు పారిపోవడం వంటి సన్నివేశాలు అనవసరం అనిపిస్తాయి.

ఇక హీరో మమ్ముట్టి చేసే పోరాటానికి మోహన్ లాల్ తోడు కావడం .. ఈ ఇద్దరి చెంతకి కుంచాకో బోబన్ చేరుకోవడం సినిమాటిక్‌గా అనిపిస్తాయి. వాళ్ల అభిమానులను అలరించడానికి చేసే ప్రయత్నంగా కనిపిస్తాయి. పోనీ అలా చూసుకున్నా, వాళ్ల క్రేజ్ కి తగినస్థాయిలో ఆ పాత్రలను డిజైన్ చేయలేదు. ప్రతి పాత్రలోనూ పవర్ తగ్గడం మనకి స్పష్టంగా తెలిసిపోతూ ఉంటుంది. ఇందుకు నయనతార పాత్ర కూడా మినహాయింపు కాదు.

ఇక కథలో మూడు వైపుల నుంచి మూడు ప్రధానమైన పాత్రలుగా మమ్ముట్టి .. మెహన్ లాల్ .. కుంచాకో బోబన్ తెరను ఆక్రమిస్తూ వస్తుంటే, మరో వైపు నుంచి విలన్ గా ఫహద్ ఫాజిల్ విరుచుకుపడటం చూపించాలి. కానీ ఆ పాత్రను కూడా డిఫరెంట్‌గా డిజైన్ చేయలేకపోయారు.ఒక అరుదైన కలయికగా .. గొప్ప కలయికగా కనిపించే ఈ కాంబినేషన్, ఆశించిన స్థాయిలో డిజైన్ చేయకపోవడంతో ఆడియన్స్ డీలాపడేలా చేస్తుంది.

కథ ఢిల్లీ .. ఆగ్రా .. లండన్ .. కొచ్చి అంటూ అనేక పంతాలకు మారుతూ ఉంటుంది. ఆయా లొకేషన్స్ బావున్నాయనిపిస్తుంది. కానీ కథాపరంగా మాత్రం ఉత్కంఠను రేకెత్తించలేకపోయింది. అందరూ సీనియర్ స్టార్స్ .. వాళ్ల నటన గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పనిలేదు గానీ, పాత్రలలో విషయం లేకపోవడం వలన వాళ్లు ఏమీ చేయలేకపోయారు.

నిర్మాణ విలువలు బాగున్నాయి. మనుష్ నందన్ ఫొటోగ్రఫీ .. సుషీన్ శ్యామ్ నేపథ్య సంగీతం ఫరవాలేదు. రాహుల్ రాధాకృష్ణన్ ఎడిటింగ్ విషయానికి వస్తే, ఫస్టాఫ్ లో ట్రిమ్ చేయవలసిన సన్నివేశాలు కనిపిస్తాయి.

స్టార్స్‌కి తగిన కథ లేకపోవడం .. వాళ్ల ఇమేజ్‌కి తగిన విధంగా పాత్రలను డిజైన్ చేయకపోవడం .. తెరపై లొకేషన్స్ మారుతూ ఉంటాయిగానీ, ఆ స్థాయిలో కథనం పుంజుకోకపోవడం నిరాశను కలిగిస్తుంది. భారీతారాగణాన్ని చూసి థియేటర్స్ కి వచ్చిన ఆడియన్స్ అసంతృప్తికి గురికావడానికి కారణాలు ఇవేనని అనిపిస్తాయి.

### సినిమా వివరాలు

సినిమా పేరు: పేట్రియాట్

విడుదల తేదీ: 2026-06-05

తారాగణం: మమ్ముట్టి, మోహన్‌లాల్, ఫహద్ ఫాసిల్, కుంచాకో, బోబన్, నయనతార, రేవతి

దర్శకుడు: మహేష్ నారాయణన్

సంగీతం: సుశీన్ శ్యామ్

బ్యానర్: ఆంటో జోసెఫ్ ఫిల్మ్ కంపెనీ

సమీక్ష: పెద్దింటి

పేట్రియాట్ రేటింగ్: 5కి 2.00

## ‘రామాయణ’లో కీలకపాత్ర .. అధికారికంగా వెల్లడించిన కాజల్

బాలీవుడ్ దర్శకుడు నితేష్ తివారీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్న పాన్ ఇండియా చిత్రం ‘రామాయణం’లో తాను నటిస్తున్నట్లు వస్తున్న వార్తలపై నటి కాజల్ అగర్వాల్ స్పష్టతనిచ్చారు. ఈ భారీ ప్రాజెక్టులో తాను భాగమైనట్లు ఆమె ధృవీకరించారు. ఇటీవల జరిగిన ఒక అవార్డుల కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ఈ చిత్రం కోసం తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కాజల్ మాట్లాడుతూ, “భారతదేశంలో ఇంతకుముందెన్నడూ చూడని అద్భుతమైన సాంకేతిక హంగులతో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇది నా కెరీర్‌లో ఒక మైలురాయిలా నిలిచిపోతుంది” అని వ్యాఖ్యానించారు.



ఈ చిత్రంలో రావణుడి భార్య మండోదరి పాత్రలో కాజల్ కనిపించనున్నారు. ‘రామాయణం’లో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి నటిస్తుండగా, రావణుడి పాత్రలో కన్నడ స్టార్ యశ్ నటిస్తున్నారు. వీరితో పాటు హనుమంతుడి పాత్రను సన్నీ డియోల్ పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనుండగా, తొలి భాగాన్ని 2026 దీపావళి కానుకగా, రెండో భాగాన్ని 2027లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది.




భాగ్యశ్రీ బోర్స్ యొక్క మెరిసే బ్రౌన్ మ్యాజిక్. ఈ స్టూడియో షూట్‌లో భాగ్యశ్రీ బోర్స్, ఒత్తుగా ఉన్న అలల జుట్టుతో మరియు చక్కదనం, ఆధునిక ఆకర్షణను వెదజల్లుతున్న శరీరానికి అతుక్కుపోయే బ్రౌన్ సీక్విన్డ్ డ్రెస్‌తో మంత్రముగ్ధులను చేసేలా కనిపిస్తున్నారు.

## 83 ఏళ్ల వయసులోనూ తగ్గని జోరు!

బిగ్ బి అమితాబ్ బచ్చన్ క్రమశిక్షణ, వృత్తి పట్ల ఆయనకున్న అంకితభావం ఎందరికో ఆదర్శం. వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని ఆయన నిరంతరం నిరూపిస్తూనే ఉన్నారు. 83 సంవత్సరాల పండు వయసులో కూడా యువ హీరోలకు సైతం పోటీనిస్తూ నిరంతరం ప్రాజెక్టులతో బిజీగా గడుపుతున్నారు. తాజాగా అమితాబ్ పని వేళలకు సంబంధించి ఓ ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. అమితాబ్ బచ్చన్ నిన్నటితరం, నేటితరం నటులందరిలోనూ అత్యంత బిజీగా ఉన్న నటుడిగా నేటికి కొనసాగుతున్నారు. ఇటీవల ఆయన ఒక ప్రాజెక్ట్ షూటింగ్ కోసం ఏకంగా తెల్లవారుజామున 4 గంటల వరకు నిరంత రాయంగా పని చేశారు. ఈ వయసులో కూడా శారీరక శ్రమను తట్టుకుంటూ రాత్రంతా మేల్కొని పని చేయడం ఆయనకు సినిమాపై ఉన్న ప్రేమకు, వృత్తిపరమైన నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ విషయాన్ని అమితాబ్ బచ్చన్ స్వయంగా తన అధికారిక బ్లాగ్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. రాత్రిపూట ఆలస్యంగా పని చేయడం వల్ల కలిగే అలసట కంటే, ఆ పని పూర్తి చేయడం వల్ల వచ్చే తృప్తి చాలా గొప్పదని పేర్కొన్నారు.

తెల్లవారుజామున 4 గంటల వరకు షూటింగ్‌లో పాల్గొన్నప్పటికీ తన ముఖంలో ఏమాత్రం అలసట కనిపించకుండా ఎంతో ఉత్సాహంగా ఆ షెడ్యూల్‌ను పూర్తి చేసినట్లు బ్లాగ్‌లో రాసుకొచ్చారు. సెట్స్‌పైకి వస్తే అమితాబ్ ఒక కొత్త నటుడిలాంటి ఉత్సాహాన్ని ప్రదర్శిస్తారని ఆయనతో పనిచేసే దర్శకులు, తోటి నటులు తరచూ చెబుతుంటారు. సమయపాలన విషయంలో అమితాబ్ ను మించిన వారు లేరనడం అతిశయోక్తి కాదు. రాత్రంతా షూటింగ్‌లో పాల్గొన్నా? మరుసటి రోజు ఉదయమే దైనందిన కార్యక్రమాలలో నిమగ్నమవ్వడం ఆయనకున్న అద్భుతమైన జీవనశైలికి .. మానసిక దృఢత్వానికి అద్దం పడుతోంది.



సాధారణంగా 60 ఏళ్లు దాటిన తర్వాత విశ్రాంతి జీవితాన్ని గడపాలని చాలా మంది భావిస్తారు. కానీ బిగ్ బి మాత్రం రిటైర్మెంట్ అనే పదానికి తన నిఘంటువులో చోటు ఇవ్వకుండా పని చేస్తున్నారు. ప్రస్తుతం అమితాబ్ -కౌన్ బనేగా కరోడ్‌పతి- వంటి భారీ టెలివిజన్ షోలతో పాటు, పలు బాలీవుడ్ .. పాన్-ఇండియా చిత్రాలలో విలక్షణమైన పాత్రలతో దూసుకుపోతున్నారు. అమితాబ్ ఎనర్జీ లెవెల్స్ చూసి నేటితరం యువ నటీనటులు ఎంతో స్ఫూర్తిని పొందుతున్నారు. ఈ వయసులో కూడా అమితాబ్ బచ్చన్ పని పట్ల చూపిస్తున్న అంకితభావం కేవలం సినీ రంగానికే పరిమితం కాదు. ఏ రంగంలోనైనా విజయవంతంగా కొనసాగాలంటే నిరంతర శ్రమ, క్రమశిక్షణ ఎంత అవసరమో అమితాబ్ జీవితం యువతకు నేర్పుతోంది. శారీరక ఇబ్బందులు, వయోభారం వంటి సవాళ్లను అధిగమిస్తూ తెల్లవార్లూ కష్టపడి పనిచేసే ఆయన తత్వం సినీ అభిమానుల గుండెల్లో అమితాబ్ స్థానాన్ని మరింత సుస్థిరం చేస్తుంది.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662